


130 కి.మీ 6 గంటలు



- మాచర్ల రైలు ప్రయాణం మహానరకం
- సమయం పొడిగింపుతో పరిస్థితి మరీ అధ్వానం
- అడుగడుగునా హాల్టింగులతో ప్రయాణికులకు ఇక్కట్లు

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): 130 కిలోమీటర్ల దూరం.. మహా అయితే రెండు నుంచి మూడు గంటల ప్రయాణం ఉంటుంది. కానీ మాచర్ల రైలు ఎక్కితే అంత దూరం ప్రయాణానికి ఐదు నుంచి ఆరు గంటలు పడుతుంది. సౌకర్యవంతంగా.. నాణ్యమైన సేవలతో ప్రయాణికుల నుంచి ఆదరణ పొందాల్సిన రైల్వే అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తోంది. ఇందుకు మాచర్ల రైలు ప్రయాణమే ఉదాహరణగా నిలుస్తోంది. మాచర్ల, రెంటచింతల, గురజాల, పిడుగురాళ్ల నుంచి గుంటూరు, విజయవాడ వెళ్లే రైలు ప్రయాణికులకు రైల్వే అధికారులు నరకం చూపిస్తున్నారు. మాచర్లలో బయలుదేరిన రైలు గుంటూరుకు ఎప్పుడు చేరుతుందో.. అసలు గమ్యం చేరుతుందో లేదో.. అన్నంతగా ప్రయాణికులను భయపెడుతోంది. పల్నాడు జిల్లా మాచర్లలో సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరే 57204 నెంబరు రైలు 130 కి.మీ దూరంలో ఉన్న గుంటూరుకు రాత్రి 8 గంటలకల్లా చేరాలి. 130 కి.మీ దూరానికి మూడున్నర గంటల సమయం పట్టడమే అన్యాయం అనుకుంటే ఆ రైలు పొరపాటున కూడా ఆ సమయానికి రాదు. పైపెచ్చు ప్రతి రోజూ మరో రెండు గంటలు ఆలస్యంగా, అంటే 5, 6 గంటల సమయం తీసుకుని రాత్రి 9:30, 10 గంటలకుగానీ గుంటూరు జంక్షన్ చేరదు. గురువారం రాత్రి కూడా 10 గంటలకుగానీ రైలు గుంటూరు చేరలేదు. గుంటూరు, మాచర్ల మధ్య కేవలం రెండు రైళ్లు మాత్రమే ఉండడంతో ఆ మార్గంలో ప్రయాణించే సామాన్య ప్రజలంతా ఆ రెండు రైళ్లపైనే ఆధారపడతారు. కరోనా పేరుతో ఇప్పటికే సగం స్టేషన్లు ఎత్తేయడంతో సగం మంది పల్నాడు పల్లె ప్రజలకు రైలు ప్రయాణం దూరమైంది. అయినా ఈ రైలు నిత్యం వేలాది మందితో రద్దీగా ఉంటుంది. అలాంటి రైలును గంటల కొద్దీ జాప్యంగా నడపడంతో ప్రయాణికులు, ప్రత్యేకించి మహిళలు, వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మాచర్లలో మధ్యాహ్నం 4:30 గంటలకు బయలుదేరాల్సిన రైలు ఇటీవల సాయంత్రం ఐదున్నర, ఆరు గంటల వరకూ బయలుదేరడమే లేదు. రైల్వే అధికారులు ఎందుకు అలా చేస్తున్నారో ప్రయాణికులకు అర్థం కావడం లేదు. తీరా బయలుదేరాక నడికుడి జంక్షన్లో అరగంట నుంచి గంట సేపు నిలిపేస్తున్నారు. ఇక అక్కడి నుంచి సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్‌లు, గూడ్స్ రైళ్ల కోసం ఈ రైలును స్టేషన్ స్టేషన్‌కు అరగంట చొప్పున ఆపేస్తున్నారు. దీంతో రెండు గంటల ప్రయాణానికి 5, 6 గంటలు పడుతోంది.

● ఉద్యోగులకూ తిప్పలు..

మాచర్ల నుంచి గుంటూరు వచ్చి గుంటూరు నుంచి మరో నెంబరు 57202 పేరుతో విజయవాడ వెళ్లే ఈ రైలుపై ఉద్యోగులు ఎక్కువగా ఆధార పడుతుంటారు. గుంటూరు నుంచి రాత్రి 8:10కి బయలుదేరే ఈ రైలు కొంత కాలంగా రాత్రి 10 గంటల వరకూ బయలుదేరడం లేదు. దీంతో ఉద్యోగులు, మహిళలు రైలుపై ఆధారపడడం మానేశారు. వారంతా ఇప్పుడు బస్సులపై ఆధార పడుతున్నారు. రైలు సమయాన్ని ఒక్క అర గంట పాటు ముందుకు జరిపితే వేలాదిమంది ప్రయాణికులకు మేలు చేసినవారవుతారని రైల్వే అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా వారు సానుకూలంగా స్పందించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. పైపెచ్చు గతంలో రాత్రి 7:45కు గుంటూరు చేరాల్సిన ఈ రైలు సమయాన్ని రాత్రి 8 గంటలకు పొడిగించారు. దీంతో ప్రయాణికులు రైల్వే అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పేదింటికి.. చేయూత

సొంతిల్లు.. అందరి కల. పేదలకు గృహయోగం సాకారం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని పథకా లు తీసుకొచ్చినా ఆశించిన ఫలితాలు రావడంలేదు. ఆయా పథకాలను సద్వి నియోగం చేసుకునేందుకు పెద్దగా పేదలు ముందుకు వచ్చే వారు కాదు. కొందరు ఇళ్లు పొందినా వాటిలో ఉండలేక చాలామంది అమ్ముకోవడం జరుగుతుంది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం 2015లో అమల్లోకి తెచ్చిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎం ఏవై)లో భారీ మార్పులు తెచ్చింది. పీఎంఏవై-2.0 పేరుతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. సమాజంలోని అన్ని వర్గాల వారు ఈ పథకం ద్వారా లబ్ధి పొందేలా మార్పు లు చేసింది. ఈ పథకంతో రెట్టింపు సాయం అందించి పేదల గృహయోగానికి చేయూతగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది.

రెట్టింపు సాయంతో గృహయోగం

- పీఎంఏవై 2.0పై ప్రభుత్వం కసరత్తు
- మూడు రూపాల్లో పథకం విస్తరణ.. రాయితీలు
- అన్ని వర్గాల వారికి లబ్ధి చేకూరేలా పథకం రూపకల్పన

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందిస్తోంది. సమాజంలోని అన్ని వర్గాలకు చెందిన వారు కూడా సొంత ఇంటిలో నివాసం ఉండేలా కార్యాచరణ సిద్ధం చేసింది. గతంలో ఎన్నో పథకాలు ఉన్నా ఆశించిన స్థాయిలో ఫలితాలను ఇవ్వడం లేదని తెలుసుకున్న కేంద్ర ప్రభుత్వం భారీ మార్పులతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0కు శ్రీకారం చుట్టింది. పేదలకు మరింత చేయూత అందిస్తూ.. నిర్మాణానికి రెట్టింపు సాయం అందించేలా పథకంలో భారీ మార్పులు చేసింది. దారిద్ర్య రేఖకు దిగువన ఉండే ఆర్థికంగా అట్టడుగు వర్గాలు, ఆర్థికంగా బలహీనమైన వారు, తక్కువ, మధ్య ఆదాయ సమూహాలుగా ఈ పథకాన్ని విస్తరించింది. తద్వారా సమాజంలోని అన్ని వర్గాలవారికి ఆర్థిక చేయూతను అందించేలా పీఎంఏవై 2.0 ఉండనున్నది. 2024 చివరిలో పీఎంఏవై 2.0కు శ్రీకారం చుట్టగా మెజారిటీ పేదలకు గృహ యోగం లభించనున్నది. కేంద్ర ప్రభుత్వం 2015లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై)కి శ్రీకారం చుట్టింది. సొంత ఇల్లు కట్టుకోవాలనుకునే పేదలకు ఈ పథకం ద్వారా ప్రభుత్వం చేయూత అందించింది. ఈ పథకంలో భాగంగా పీఎం ఏవై (అర్బన్) కింద అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టణ పేదలకు (మిగతా 6వ పేజీలో)

నాలుగు రకాలుగా..

- బీపీఎల్ : దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, ఆర్థికంగా అట్టడుగు వర్గాలు.
- ఈడబ్ల్యూఎస్ : ఆర్థికంగా బలహీనమైన విభాగం.
- ఎల్ఐజీ : తక్కువ ఆదాయ సమూహం.
- ఎంఐజీ : మధ్య ఆదాయ సమూహం

తక్కువ ధరల్లో అద్దె ఇళ్లు(ఏఆర్‌హెచ్)

ఇప్పటి వరకు సొంత ఇళ్లకు మాత్రమే పరిమితమైన ఈ పథకం పట్టణంలో ఉండే నిలువ నీడలేని వలస కూలీల కోసం తక్కువ ధరలో అద్దె ఇళ్లు అందించే ప్రయత్నం చేస్తోంది. శ్రామిక మహిళలు, పారిశ్రామిక కార్మికులు, నిరాశ్రయులు, విద్యార్థులు ఇతర లబ్ధిదారులకు అందుబాటులో ఉండే ప్రభుత్వ భవనాల్లోని ఖాళీ ప్లాట్లను తక్కువ అద్దెకు అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది. వాటిని స్వల్ప కాలిక ప్రాతిపదికన అందించాలని భావి స్తోంది. ఇది ఆచరణలో సాధ్యం కాకపోవచ్చని, అనేక సాంకేతిక సమస్యలు తలెత్తుతాయని అధికారులు భావిస్తున్నారు.





రాజధానిలోని నేలపాడులో జరుగుతున్న వివిధ పనులను మంత్రి నారాయణ శుక్రవారం పరిశీలించారు. సీఆర్‌డీఏ అధికారులతో కలిసి నీటి తోడకం అభివృద్ధి పనులను పరిశీలించారు.

అలా ఎందుకు చేశారో చెప్పండి? 6

- మంత్రి లేఖ బట్టబయలుపై మెమో జారీ

జీడీసీసీబీ రేసులో.. ఆ ఇద్దరు



కుర్రా అప్పారావు



మక్కెన మల్లికార్జునరావు

◆ చైర్మన్ పదవి కోసం **పోటాపోటీ**

- ◆ సిఫార్సు లేఖలతో రంగంలో మక్కెన మల్లికార్జునరావు, కుర్రా అప్పారావు
- ◆ అత్యధిక మంది ప్రజాప్రతినిధుల మద్దతుతో అప్పారావు
- ◆ వైసీపీని వీడి టీడీపీలో చేరడం మల్లికార్జునరావుకి మైనస్

గుంటూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోనే కీలకమైన గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (జీడీసీసీబీ) ఛైర్మన్‌పదవి కోసం టీడీపీలో ఇద్దరు నేతలు పోటీ పడుతున్నారు. వీరిలో ఒకరు వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మరొకరు టీడీపీ సీనియర్ నేత కుర్రా అప్పారావు. మక్కెన నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులుతో పాటు వైసీపీని వీడి ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. అంతకు ముందు ఆయన వైసీపీలో కొనసాగుతూ 2019 ఎన్నికల్లో వినుకొండ వైసీపీ అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు విజయానికి సహకరించారు. ఆ తర్వాత బొల్లాతో విభేదించి పార్టీకి దూరంగా ఉంటూ వచ్చారు. అయితే అప్పటికే వైసీపీ ఎంపీగా కొనసాగుతున్న శ్రీకృష్ణదేవరాయలుతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ వచ్చారు. ఆయనతో ఉన్న సాన్నిహిత్యం మూలంగానే 2024 ఎన్నికల నాటికి టీడీపీలో చేరి వినుకొండలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విజయానికి కృషి చేశారు. దీంతో జీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ పదవికి మక్కెన పేరును సిఫార్సు చేస్తూ ఎమ్మెల్యే ఆంజనేయులు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కూడా మక్కెనకు ఇవ్వాలని కోరుతూ లేఖలు ఇచ్చారు. ఇక ఛైర్మన్ పదవి ని ఆశిస్తున్న చిలకలూరిపేట నియోజకవర్గానికి చెందిన కుర్రా అప్పారావు రేసులో ముందంజలో ఉన్నారు. ఛైర్మన్ పదవి పొందేందుకు ఏదో ఒక సొసైటీ నుంచి అధ్యక్షుడిగా గెలు పొందాల్సి ఉండటంతో తన సొంత మండలమైన యడ్లపాడులోని మర్రి పాలెం గ్రామాన్ని అప్పారావు ఎంచుకుని గ్రౌండ్ సిద్ధం చేసుకున్నారు. ప్రస్తుతం ఆ సొసైటీ నుంచి ఆయన తండ్రి కుర్రా రత్త య్య సొసైటీ అధ్యక్షుడుగా ఉన్నారు. రత్తయ్య జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్‌గా చాలా కాలం పనిచేశారు. అప్పారావు గతం లో రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శిగా పనిచేశారు. తొలి నుంచి టీడీపీకి ఆయన కుటుంబం అంకితమై పని చేస్తున్నది. గతంలో మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య విజయానికి, ఆ తర్వాత మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు విజయంలో అప్పారావు కుటుంబం కీలకంగా వ్యవహరించింది. అలాగే ఇటీవల ఎన్నికల్లో సొంత నియో జకవర్గమైన చిలకలూరిపేటలో పుల్లారావు గెలుపునకు, పెదకూరపాడు నుంచి పోటీ చే సిన తన చిన్ననాటి మిత్రుడు భాష్యం ప్రవీ ణ్ గెలుపులోనూ అ ప్పారావు ప్రధాన పాత్ర పో షించారు. ఈ ఎన్నికల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి బరిలోకి దిగిన పలువురు ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి హార్థిక, ఆర్థిక సహకారం కూడా తన వంతుగా అందించారు. దీంతో అప్పారావు ఆశిస్తున్న ఛైర్మన్ పదవికి తొలి నుంచి పార్టీలో ఉన్న వారెవరూ కూడా పోటీకి రాలే దు. అంతేకాకుండా అప్పారావుకు పదవి ఇవ్వాలని కోరు తూ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఇద్దరు ఎంపీలు, సీని యర్ ఎమ్మెల్యేలందరూ సిఫార్సు లేఖలు ఇచ్చారు. సీని యర్ మోస్ట్ ఎమ్మెల్యేలైన ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, కన్నా లక్ష్మీనారాయణలు సైతం అప్పారావును బలపరి చారు. అలాగే గుంటూరు జిల్లా (మిగతా 6వ పేజీలో)



ఇసుక తవ్వకాల్లో ఇష్టారాజ్యం

- యంత్రాలతో తవ్వి యథేచ్ఛగా తరలింపు
- అక్రమాలను పట్టించుకోని మైనింగ్ శాఖ

తెనాలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పట్టవు.. అధికారుల హెచ్చరికలను పాటించరు.. ఇసుక రీచ్‌ల్లో ఇష్టారాజ్యంగా మారింది. ఇన్‌చార్జ్ సబ్‌కలెక్టర్ స్వా ప్నిల్ పవార్ రీచ్‌కు వెళ్లి నిబంధనలకు విరుద్ధంగా తవ్వితే కాంట్రాక్ట్ రద్దు చేస్తామని హెచ్చరికలు చేసి గంట కూడా గడవకముందే నదిలో ఎక్స్‌కవేటర్ పెట్టి ఇసుక తరలించేటంతగా బరితెగించేశారు. ఇసుక దోపిడీలో మార్పు వస్తుందని ఆశపడిన కృష్ణా తీరగ్రామాల రైతుల అడియాశలుగా మారాయి. పిడపర్తిపాలెం వద్ద పగలు ఎక్స్‌కవేటర్‌ను నది ఒడ్డున ముళ్ల కంపల మాటున దాచి, చీకటి పడగానే నదిలోకి తీసుకెళ్లి ఇసుకను తవ్వి లారీల్లో తరలిస్తున్నారు. నదిలో, డంపింగ్ కేంద్రాల దగ్గర సాయంత్రం 6 తర్వాత ఇసుక లోడింగ్ చేస్తే కాంట్రాక్ట్ రద్దు చేస్తామని అధికారులు హెచ్చ రిస్తున్నా ఎవరూ ఆలకించడంలేదు. పైగా డంప్ యార్డు దగ్గరకు ఇసుక తరలించడానికి లారీలనే ఉపయోగిస్తున్నారు. ఎక్కడా కూలీలతో ఇసుక పోస్తున్న దాఖలాలు లేవు.



పిడపర్తిపాలెం వద్ద చెట్ల చాటున దాచి ఉంచిన ఎక్స్‌కవేటర్

అనుమతిలోనే కిరికిరి..

ఒక్కో కాంట్రాక్టర్‌కు 60 వేల టన్నుల వరకు ఇసుక తవ్వి ఒడ్డుకు చేర్చి, లోడ్ చేసేందుకు అనుమతి ఇచ్చారు. నెలల తరబడి గడువు ఇవ్వడంతో ఇక్కడే కిరికిరి ఉంది. వాస్తవానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిన పరిమాణం రోజుల వ్యవధిలోనే పూర్తైపోతుంది. ఉదాహరణకు ఒక లారీకి 30 టన్నుల ఇసుక లోడ్ చేశారనుకుంటే రోజుకు కనీసం 200 లారీల చొప్పున 6 వేల టన్నులు పది రోజుల్లోనే పూర్తవుతుంది. అయితే ఇక్కడ ఇప్పటి వరకు 20 శాతం బిల్లులనే కాంట్రాక్టర్లు లారీలకు ఇచ్చారు. మిగిలినవి వారిదగ్గరే ఉంచుకుని, ఇసుకను రాత్రి వేళల్లో తరలిస్తున్నారు. బిల్లులు ఉండవు, కనుక వారికి అనుమతిచ్చిన పరిమాణం ఎప్పటికీ పూర్తికాదు. ఈ వ్యవహారం పోలీసుల, రెవెన్యూ, మైనింగ్ అధికారులకు తెలిసినా తెలియదన్నట్లు మిన్నకుండటం విశేషం.

రేటులోనూ పెద్దగా మార్పేమీ లేదు..

ఉచిత ఇసుక విధానంలో గతంలో కంటే తక్కువకు వినియోగదారుడికి అందాలి. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో ధరకు ఇప్పుడు వసూలు చేస్తున్న దానికి పెద్దగా మా ర్పులేదు. గతంలో టన్నుకు ఎంతోకొంత ప్రభుత్వానికి కాంట్రాక్టర్లు చెల్లించాల్సి వచ్చేది. ఉచిత ఇసుక విధానాన్ని కూటమి ప్రభుత్వం తీసుకొస్తే అప్పటి ఇసుకాసురులే ఇప్పుడూ రీచ్‌లలో తిష్ఠ వేశారు. ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం కూలీలతో తవ్వి టన్నుకు రూ.140 నుంచి రూ.150 మాత్రమే వసూలు చెయ్యాలి. కానీ టన్నుకు రూ.350 నుంచి రూ.450 వరకు పడుతోంది. నదిలోనే ఎక్స్‌కవేటర్‌తో లారీకి లోడ్ చేసినందుకు 30 నుంచి 35 టన్నులకు రూ.7 వేల నుంచి రూ.9 వేల వరకు వసూలు చేస్తున్నారు. అంటే అక్కడి నుంచి పట్టణాలకు, దూర ప్రాంతాలకు తీసుకెళితే లారీ ఇసుక రూ.12 వేల నుంచి రూ.15 వేలపైనే పలుకుతోంది.

ఫైర్‌సేఫ్టీ రూ.10 వేలు

- కోల్డ్‌స్టోరేజ్ లైసెన్సుల పునరుద్ధరణలో మామూళ్ల దందా

గుంటూరు సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): 'గత ఏడాది జనవరి 19న రాత్రి దుగ్గిరాలలో శుభం మల్లీశ్వరి కోల్డ్‌స్టోరేజ్‌లో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో లక్షా 15 వేల బస్తాల పసుపు అగ్నికి ఆహుతి కాగా ఆరు జిల్లాల రైతులు రూ.కోట్లలో నష్టపోయారు. ఇంత వరకు చాలా మందికి సరైన పరిహారం అందిన దాఖలాలు లేవు. దుగ్గిరాల అగ్నిప్రమాదం అనుభవాన్ని దృష్టిలో పెట్టుకున్న అధికారులు కోల్డ్ స్టోరేజ్ లైసెన్సు ల రెన్యువల్ ప్రక్రియను కొంత జఠిలం చేశారు. ఫైర్ సేఫ్టీ(అగ్ని భద్రత) కి సంబంధించిన నిబంధనలు పాటి స్తేనే లైసెన్సు పునరుద్ధరణ జరుగుతుందని స్పష్టం చేశారు. అయితే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని కోల్డ్‌స్టోరేజ్‌లు చాలా వరకు 20 ఏళ్ల క్రితం నిర్మించినవే. నూతన ఫైర్‌సేఫ్టీ విధానం వాటికి ఎంతవరకు వర్తిస్తుందన్న దానిపై సందిగ్ధత నెలకొంది. ఈ విషయంలో అటు అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులతో సంప్రదింపులు చేస్తుంది. ఇంతలోనే గుంటూరు యార్డు పరిధిలో 34, ప్రత్తిపాడు యార్డు పరిధిలో 70 కోల్డ్ స్టోరేజ్‌లకు లైసెన్సు రెన్యువల్ ప్రక్రి యను అధికారులు తెరపైకి తెచ్చారు. ఒక్క రోజులోనే అన్ని లైసెన్సులు రెన్యువల్ కావాలంటూ అధికారులు హడావుడి చేస్తున్నారు. 2014-2019 వరకు కోల్డ్‌స్టోరేజ్‌ల ఫైర్‌సేఫ్టీని పరిశీలించి, నిరభ్యంతర సర్టిఫికెట్ ఇచ్చే అధికారం జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులకు ఉండేది. జగన్ ప్రభుత్వంలో ఆ బాధ్యతను రాష్ట్ర అధికారులకు అప్పగించింది. ఫలితంగా ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించని స్టోరేజ్‌లకు కూడా నిరభ్యంతర సర్టిఫికెట్లు వచ్చాయి. అందుకోసం రాష్ట్ర అధికారులు జిల్లాకు ఒక బ్రోకర్‌ని ఏర్పాటు చేసి నగదు వసూలు చేశా రన్నది బహిరంగ రహస్యం. ఈ క్రమంలో తాజాగా ఒక్కో స్టోరేజ్ వద్ద తక్కువలో తక్కువ రూ.10 వేలు తీసుకున్నాక రెన్యువల్ ప్రక్రియ మొదలుపెట్టినట్లు సమాచారం. సీజన్ ఆరంభానికి ముందు లైసెన్సు పునరుద్ధరణ జరగాలంటే అడిగినంత ఇవ్వాల్సిందేనని కోల్డ్ స్టోరేజీ నిర్వాహకులకు అధికారులు సందేశం పంపారు. ఇటీవల కూడా కొన్ని స్టోరేజ్‌ల వద్ద ఇదేవిధంగా తీసుకున్నట్లు తెలిసింది. ఒక ట్రేడర్‌ను వెంటపెట్టుకుని వెళ్లి మరీ ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలుస్తోంది. కొందరు అధికారులు ఈ విషయంలో దూకుడుగా ఉన్నట్లు తెలిసింది.

అఫిడవిట్ ఎంతవరకు..

కోల్డ్‌స్టోరేజ్‌ల లైసెన్సులను పునరుద్ధరించేందుకు యజమానుల వద్ద అఫిడవిట్ తీసు కుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ప్రమాదం జరిగి రూ.కోట్ల సరుకు అగ్నికి ఆహుతి అయితే అది రైతు ప్రయోజనాలను ఎంత వరకు పరిరక్షిస్తుందన్నది అంతుపట్టని ప్రశ్న. కోల్డ్‌స్టోరేజ్ లైసెన్సు రెన్యువల్ కోసం యజమానులు ఇస్తున్న అఫిడవిట్‌కు ఏవిధమైన చట్టబద్ధత లేదని కొందరు అధికారులు సైతం అంగీకరిస్తున్నారు. ప్రస్తుతం లైసెన్సుల పునరుద్ధరణ కోసం కొన్ని కోల్డ్ స్టోరేజ్‌ల యజమానులు సరైన ఇన్సూరెన్స్ చేయకుండానే చేసినట్లు అఫిడవిట్‌లో చూపుతున్నారు. పాత ఇన్సూరెన్స్ పత్రాలను కూడా చూపించి తప్పుదారి పట్టిస్తున్నారని కొందరు సిబ్బంది గుర్తించారు. అటువంటి లైసెన్సులను రెన్యువల్ చేస్తే భవిష్యత్‌లో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అగ్గి రేగితే.. బుగ్గే

భవన నియమ నిబంధనలు ప్రకారం 15 మీటర్ల కన్నా ఎక్కువ(మూడు అంతస్థులు) ఎత్తున నిర్మాణం జరిగితే ఖచ్చితంగా ఫైర్‌సేఫ్టీ ఉండాలి. బిల్డింగ్ చుట్టూ అగ్నిమాపక వాహనం తిరిగేలా ఖాళీ వదలాలి. అగ్ని మాపక వాహనం లోపలికి వెళ్లడానికి తగినంత స్థలం వదిలి నిర్మాణాలు చేపట్టాలి. అయితే ఉమ్మడి గుంటూ రు జిల్లాలోని చాలా కోల్డ్‌స్టోరేజ్‌ల్లో ఆ ఏర్పాటు లేదు. చాలా కోల్డ్‌స్టోరేజ్‌లు ఇరుకుగా ఉండే స్థలాల్లో నిర్మిం చారు. పొరపాటున అగ్గి రాచుకుంటే లోపలికి ఫైర్ ఇంజన్ వెళ్లే అవకాశం కూడా చాలా తక్కువగా ఉంది. ఇంతటి ప్రమాదకర పరిస్థితులు కళ్లకు కనిపిస్తున్నా అధికారులు ఏదో ఒక సాకు చెప్పి లైసెన్సు రెన్యువల్ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

అలా ఎందుకు చేశారో చెప్పండి?

- యార్డు కార్యదర్శికి మార్కెటింగ్ డైరెక్టర్ ఆదేశం
- మంత్రి లేఖ బట్టబయలుపై మెమో జారీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి లేఖను బట్టబయలు చేసిన వ్యవహారంలో రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ స్పందించారు. ఈ నెల 21న 'ఆంధ్రజ్యోతి'లో 'మంత్రి లేఖ బట్టబయలు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన మార్కెటింగ్ డైరెక్టర్ ఎం.విజయ సునీత బాధ్యులపై చర్యలు చేపట్టారు. అధికారిక లేఖను వెల్లడి చేసిన గుంటూరు మిర్చి యార్డు ఇన్‌చార్జ్ కార్యదర్శి వినుకొండ ఆంజనేయులకు శుక్రవారం మెమో జారీ చేశారు. అధికారిక ఉత్తర, ప్రత్యుత్తరాల దశలో ఉన్న లేఖను ఎందుకు బయట పెట్టారో మూడు రోజుల్లో సమాధానం చెప్పాలని ఆదేశించారు. అధికారిక లేఖను బట్టబయలు చేయటం ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ రూల్స్-1964కు విరుద్ధం అని మెమోలో పేర్కొన్నారు. మెమోకు 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని జత పరిచారు.

కుక్కల కు.ని కేంద్రంలో తనిఖీ

- డంపింగ్ యార్డు వద్ద శస్త్రచికిత్సలు చేయటంపై విచారణ



కుక్కల కు. ని కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జాతీయ జంతు కల్యాణ మండలి బృందం

గుంటూరు సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పరిధిలోని ఏటుకూరు రోడ్డులో ఉన్న కుక్కల కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల కేంద్రాన్ని జాతీయ జంతు కల్యాణ మండలి బృందం శుక్రవారం తనిఖీ చేసింది. ఈ బృందం లో డాక్టర్ ముఖేష్ గుప్తాతో పాటు మరికొందరు సెంట్రల్ టీమ్ సభ్యులు ఉన్నారు. డంపింగ్ యార్డు వద్ద కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు జరుగుతున్నాయని గతంలో తనిఖీకి వచ్చిన కేంద్ర బృందం గుర్తించింది. యానిమల్ బర్త్ కంట్రోల్ కార్యక్రమం ఆ ప్రదేశంలో నిర్వహించటం వల్ల కుక్కల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరిగే కేంద్రాన్ని వెంటనే మార్చాలని నగర పాలక సంస్థకు సూచించారు. ఈ నేపథ్యంలో నగర పాలక సంస్థ జాతీయ జంతు కల్యాణ మండలి వద్దకు అప్పీల్‌కు వెళ్లింది. యానిమల్ బర్త్ కంట్రోల్ కార్యక్రమం అదే ప్రదేశంలో నిర్వహిస్తామని, అయితే తగిన జాగ్రత్తలు తీసుకుంటామని విజ్ఞప్తి చేశారు. నగర పాలక సంస్థ అప్పీల్ నేపథ్యంలో కేంద్ర బృందం మరోసారి పరిశీలనకు వచ్చింది. కుటుంబ నియంత్రణ జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్‌ను తనిఖీ చేశారు. తనిఖీల్లో కేంద్ర బృందంతో పాటు జిల్లా పశుసంవర్థక శాఖకు చెందిన ఏడీఏలు డాక్టర్ మోహన్ రావు, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ చక్రవర్తి, జంతు సంరక్షణ సమితి సభ్యుడు జాగు సురేష్, జాగు నరసింహారావు పాల్గొన్నారు.

గవర్నర్ తేనేటి విందుకు జాజికి ఆహ్వానం



కొమెర జాజి

కారంపూడి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈనెల 26వ తేదీన రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తేనేటి విందుకు కారంపూడికి చెందిన పర్యావరణవేత్త కొమెర అంకారావు (జాజి)కి ఆహ్వానం అందింది. గతేడాది గణతంత్ర దినోత్సవం రోజున గవర్నర్ తేనేటి విందుకు కూడా జాజికి ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా జాజిని మండల ప్రజలు అభినందించారు.

రూ.6 వేల పింఛన్ ప్రభుత్వ ఘనతే

- మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి



గరల్స్ హాస్టల్‌లో వసతులను పరిశీలిస్తున్న మంత్రి డోలా

బాపట్ల రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని సోషల్ వెల్ఫేర్, డిజెబుల్ అండ్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్, సచివాలయం అండ్ విలేజ్ వలంటరీ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. శుక్రవారం బాపట్ల మండలం వెదుళ్ళపల్లి పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలో మౌలిక వసతులను పరిశీలిస్తూ గరల్స్ హాస్టల్‌లో డస్ట్‌బిన్స్ లేవనీ, వాటిని త్వరగా ఏర్పాటు చేయాలనీ, కిటికీలకు దోమల మెష్‌లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలు, కావాల్సిన మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

బధిరుల ఖాతాకే పింఛన్ జమ

అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ బధిరుల పింఛన్ నేరుగా వారి అకౌంట్‌లకే జమ చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారనీ, దీనిని పూర్తి స్థాయిలో అమలు చేస్తామన్నారు. బధిరుల ఆశ్రమ పాఠశాలలోని పాతకాలపు భవనాలకు త్వరలోనే మరమ్మతులు చేపడతామన్నారు. దివ్యాంగుల పట్ల సమాజంలో గౌరవం కలగాలనేది ప్రభుత్వ సంకల్పమనీ, దీనిలో భాగంగా విశాఖపట్నంలో 25 ఎకరాలలో రూ. 200 కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో పారా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. హాస్టల్‌లో విద్యార్థులకు మంచాలు బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ డోనేట్ చేస్తామనడం అభినందనీయం అన్నారు. బాపట్ల శాసన సభ్యుడు వేగేశన నరేంద్రవర్మ, బావుడా చైర్మన్ సలగల రాజశేఖరబాబు, కలెక్టర్ జె.వెంకటమురళి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, రెవెన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దావోస్ పర్యటనపై విమర్శలు సిగ్గుచేటు

దావోస్ వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏమి తెచ్చారని కొందరు మాజీ మంత్రులు విమర్శించడం సిగ్గుచేటని, కేవలం వాళ్ల ఉనికిని చాటుకునేందుకు మాట్లాడుతున్నారని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు.

వీరయ్య చౌదరి ఆశయాలను కొనసాగిస్తాం



స్మృతి వనం వద్ద వీరయ్య చౌదరికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, కుటుంబ సభ్యులు

పొన్నూరుటౌన్, చేబ్రోలు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): దివంగత ధూళిపాళ్ల వీరయ్య చౌదరి తమకు ఇచ్చిన ఆశయాలను కొనసాగిస్తానని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం పొన్నూరు - చేబ్రోలు మండలాల్లో మాజీ మంత్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి 31వ వర్ధంతి, మరో మాజీ మంత్రి పరిటాల రవి వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో వీరయ్య చౌదరి స్మృతి వనం వద్ద కుటుంబ సభ్యులు, నరేంద్ర కుమార్ కుమార్ జ్యోతిర్మయి దంపతులతో పాటు వీరయ్య చౌదరి సతీమణి ప్రమీలాదేవి నివాళులర్పించారు. అనంతరం చింతలపూడి గ్రామంలోని వీరయ్య చౌదరి, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే నిడుబ్రోలులో జాగర్లమూడి సుధీర్ ఆధ్వర్యంలో మాజీ మంత్రులు వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ పాల్గొని నివాళులర్పించారు. మైనార్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు పఠాన్ ఫైరోజ్ ఖాన్ ఆధ్వర్యంలో కూరగాయల వర్తక సంఘం నాయకులు ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. పేదలకు అన్నదానం చేశారు. చేబ్రోలు మండలం నారాకోడూరులోని వీరయ్య చౌదరి స్మృతి వద్ద ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు నివాళులు అర్పించారు. నారాకోడూరు సెంటర్లో డీవీసీ, పరిటాల రవి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ ప్రారంభించారు. కాకాని వెంకటరత్నం, పశుదాణ కారాగారం డీవీసీ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్లో డీవీసీ వర్ధంతి ఘనంగా జరిగింది. వడ్లమూడి గ్రామంలో డీవీసీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హాస్పిటల్ ఎండీ ధూళిపాళ్ళ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో 500 మందికి ఉచిత వైద్య సేవలు అందించి ట్రస్టు ద్వారా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సంగం డెయిరీ ఆవరణలో డీవీసీ వర్ధంతి ఘనంగా జరిగింది. సంగం డెయిరీ పాలకవర్గ సభ్యులు ఏడు లక్షల నగదు చెక్కును డీవీసీ హాస్పిటల్‌కు చైర్మన్ నరేంద్ర కుమార్ చేతుల మీదుగా అందజేశారు. సంగం డెయిరీ పరిధిలో మరణించిన పాల రైతులు 8 మందికి రూ. 4.25 లక్షల పరిహారం, ఇద్దరు ఉద్యోగుల కుటుంబాలకు రూ.2.71 లక్షలు, పాడి గేదెలు చనిపోయిన 12 మంది రైతులకు రూ. 6.70 లక్షలు పరిహార చెక్కులను చైర్మన్ నరేంద్ర కుమార్ అందచేశారు. పొన్నూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో వర్ధంతి కార్యక్రమం జరిగింది. సంగం డెయిరీ మాజీ చైర్మన్ కుర్ర వీరయ్య చౌదరి, సుదీర్ఘకాలం పార్టీకి సేవ చేసిన సీనియర్ కార్యకర్తలను ఘనంగా సత్కరించి ఆర్థిక సహాయం అందించారు.

పేదింటికి.. చేయూత

(5వ పేజీ తరువాయి)

టిడ్కో ఇళ్లు అందజేసింది. పీఎంఏవై(గ్రామీణ) కింద గ్రామీణ పేదలకు ఇళ్ల నిర్మాణానికి చేయూత ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 2.95 కోట్ల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల వ్యాప్తంగా అర్హులైన పేదల కోసం సర్వే చేపట్టింది.

రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు..

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారిని ఒక విభాగంగా గుర్తించి వారికి సొంత ఇల్లు అందుబాటులోకి తేవడమే ఈ విధానం ముఖ్య ఉద్దేశం. సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి కేంద్రం నుంచి ఆర్థిక సహాయం అందజేస్తుంది. లేనివారికి స్థలం అందజేసి అందులో ఇంటి నిర్మాణానికి కావాల్సిన ఏర్పాట్లను ప్రభుత్వమే చూసుకుంటోంది. అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఒక విధాన ప్రకటన చేసింది. పట్టణ ప్రాంతంలో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. బెనిఫిషరీ లెడ్ కన్‌స్ట్రక్షన్(బీఎల్‌సీ) కింద వీరికి ఇప్పటి వరకూ కేంద్రం అందిస్తున్న ఆర్థిక సహాయం కూడా రెట్టింపు కానుంది. ఇప్పటి వరకూ ఇచ్చే రూ.1.50 లక్షల సాయాన్ని ఇక నుంచి రూ.2.50 లక్షలకు పెంచాలని కేంద్రం భావిస్తోంది. ఈ మొత్తంలో కేంద్రం వాటాలో ఎలాంటి మార్పు లేదు. గతంలో మాదిరిగా కేంద్రం రూ.1.50 లక్షలు మాత్రమే ఇస్తుండగా, అదనంగా ఇచ్చే రూ.లక్ష రాష్ట్ర ప్రభుత్వ 40 శాతం మ్యాచింగ్ గ్రాంటుగా ఉంటుందని సమాచారం. దీంతోపాటు స్వచ్ఛ భారత్ స్కీమ్ కింద మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12 వేలు, నరేగా మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.27 వేలు అందించనున్నారు. ఈ పథకం కింద మురికివాడలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వితంతువులు, దివ్యాంగులు, పారిశుధ్య కార్మికులు, వీధి వ్యాపారులు, చేతివృత్తుల వారు, అంగన్వాడీ కార్యకర్తలకు ఈ స్కీమ్ కింద సహాయం అందుతుంది.

- **అఫర్డబుల్ హౌసింగ్ (ఏహెచ్‌పీ)**

ఈ విభాగం కింద రాష్ట్రాలు, నగరాలు, ఇతర ప్రైవేటు ఏజెన్సీల ద్వారా కొంత వాటా, కేంద్రం నుంచి కొంత వాటా వేసి ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య పద్ధతుల్లో ఇళ్లను నిర్మిస్తారు. వీటిని ప్రధానంగా ఆర్థికంగా బలహీన సమూహాలు (ఈడబ్ల్యూఎస్)లకు అందిస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్ల మాదిరిగానే కొంత మొత్తం చెల్లించి ఈ అపార్టుమెంట్లలో ప్లాట్లను అందజేస్తారు. సరసమైన ధరల్లో అందించేందుకు వీలుగా రిడీమబుల్(వినియోగించుకో తగిన) హౌసింగ్ ఓచర్లను అందుబాటులో ఉంచుతారు.

- **వడ్డీ రాయితీ..**

ఎంతో కొంత స్తోమత ఉండి ఇల్లు కట్టుకునేందుకు బ్యాంకు ద్వారా రుణం పొందేవారిని ఉద్దేశించి ప్రభుత్వం ఈ విధానాన్ని ముందుకు తెచ్చింది. గరిష్ఠంగా రూ.25 లక్షల రుణం, లేదా రూ.35 లక్షలు ఇంటి విలువ ఉండి వార్షిక ఆదాయం రూ.3 లక్షల వరకూ ఉన్న ఈడబ్ల్యూఎస్ కుటుంబాలు, 3- 6 లక్షల ఆదాయం ఉన్న ఎల్‌ఐజీ కుటుంబాలు, 6- 9 లక్షల ఆదాయం ఉన్న ఎంఐజీ కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వడ్డీ రాయితీ వస్తుంది. వీరికి వడ్డీ రాయితీ ఐదేళ్లపాటు గరిష్ఠంగా రూ.1.80 వేలు అందజేస్తారు.

జీడీసీసీబీ రేసులో.. ఆ ఇద్దరు

(5వ పేజీ తరువాయి)

నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రులు నాదెండ్ల మనోహర్, నారా లోకేశ్ ఆశీస్సులు కూడా అప్పారావుకే ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఒక్క వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాత్రం తన నియోజకవర్గానికి చెందిన మక్కెనను కాదని అప్పారావుకు లేఖ ఇవ్వడం భావ్యం కాదని నిరాకరించినట్లు తెలిసింది. ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు తొలుత మక్కెనకే లేఖ ఇచ్చినప్పటికీ అప్పారావుకు కూడా లేఖ ఇస్తూ తన తొలి ప్రాధాన్యం మాత్రం మక్కెనకేనంటూ చెప్పినట్లు తెలిసింది. దీంతో అప్పారావు పేరును అధిష్ఠానం లాంఛనంగా ప్రకటించటం మాత్రమే మిగిలిఉందని చెబుతున్నారు. మక్కెన టీడీపీలో కొత్తగా చేరడం, ఇద్దరూ ఒకేసామాజికవర్గం కావడంతో ఆయన పోటీలో వెనకపడ్డారు. పైగా వినుకొండ ఎమ్మెల్యే జీవీకి ఇటీవల కేబినెట్ మంత్రిగా హోదా ఉన్న చీఫ్‌విప్ పదవి ఇవ్వడంతో అదే నియోజకవర్గానికి చెందిన మక్కెనకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో కీలకమైన జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవి వరించే అవకాశాలు తక్కువగా ఉన్నాయి.

యూజీసీ నిబంధనల ప్రకారమే పదోన్నతులు

గుంటూరు సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన సీనియర్ ప్రొఫెసర్ పదోన్నతుల ప్రక్రియ యూజీసీ నిబంధనల ప్రకారమే జరిగాయని యూనివర్సిటీ రిజిస్ట్రార్ జి.రామచంద్రరావు పేర్కొన్నారు. యూనివర్సిటీ పదోన్నతులు, బదిలీల్లో అక్రమాలు జరిగినట్లు వచ్చిన వార్తలపై ఆయన స్పందించారు. జీవో 20 ప్రకారం అర్హత కలిగిన వారికే పదోన్నతులు కల్పించినట్లు ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయం పరిపాలన సౌలభ్యం, జవాబుదారితో సాధారణ బదిలీలు చేసినట్లు వివరించారు. గత ప్రభుత్వ రాజకీయ ఒత్తిడుల మూలంగా అవసరానికి మించి తిరుపతిలో ఉన్న సూపరింటెండెంట్లను అంచలవారీగా సవరించుకుంటూ వస్తున్నామని తెలిపారు. ఐఏటీ బిల్డింగ్ నిర్మాణం ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా ఏపీఐఐసీ నిధులను విడతల వారీగా విశ్వవిద్యాలయం నుంచి నేరుగా విడుదల చేస్తారనీ, రూ.15 కోట్లు నేరుగా డ్రా చేయడం అసాధ్యం అని పేర్కొన్నారు. నిబంధనలు అనుసరించి నిధులన్నీ యూనివర్సిటీ కంట్రోలర్ దగ్గరే ఉంటాయన్నారు. విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలో భర్తీ కాకుండా మిగిలిన బీఎస్సీ అగ్రికల్చర్ 140 సీట్లు విశ్వవిద్యాలయ నియమ, నిబంధనలకు అనుగుణంగా భర్తీ చేసినట్లు తెలిపారు. విశ్వవిద్యాలయంలో పేపర్ లీకేజీ విషయంపై సదరు వ్యక్తిపై శాఖా పరమైన క్రమశిక్షణ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

మిర్చి రైతులకు గిట్టుబాటు ధర కోసం కృషి

- ది గుంటూరు చిల్లీస్ కమీషన్ ఏజంట్స్ అసోసియేషన్



నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న నాయకులు

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మిర్చి రైతులు, ఎగుమతిదారులకు మధ్య వారధిగా ఉంటూ ప్రస్తుత సీజన్‌లో మిరపకాయల ధరలు పెరిగేందుకు కృషి చేస్తామని ది గుంటూరు చిల్లీస్ కమీషన్ ఏజంట్స్ అసోసియేషన్ నాయకులు చెప్పారు. శుక్రవారం లాలుపురం వై జంక్షన్ వద్ద ఉన్న సమావేశ మందిరంలో అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. అధ్యక్షుడిగా దాది నరేంద్రబాబు, ఉపాధ్యక్షుడిగా జంగా నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ముక్కాల విజయభాస్కరరెడ్డి, ఉప కార్యదర్శిగా అన్నపరెడ్డి రవికుమార్, కోశాధికారిగా కర్పూరపు కోటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి నూతన కార్యవర్గాన్ని అభినందించారు. రైతులు, వ్యాపారస్తుల సంక్షేమం కోసం అసోసియేషన్ కృషి చేయాలన్నారు. నూతన అధ్యక్షుడు నరేంద్రబాబు మాట్లాడుతూ వ్యాపారస్తుల సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు.

పెట్టుబడులే లక్ష్యంగా దావోస్ పర్యటన



ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బృందం దావోస్ పర్యటన విజయవంత మైందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటన ముగించుకొని రాష్ట్రానికి రావటంతో తాడేపల్లిలోని చంద్రబాబు నివాసంలో ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వనరులతో పాటు నైపుణ్యం కలిగిన మానవ వనరులు, పౌర సేవల్లో టెక్నాలజీ వినియోగం, స్పీడ్ డూయింగ్ బిజినెస్ తదితర అంశాలను సీఎం బృందం కార్పొరేట్ దిగ్గజాలకు వివరించిందన్నారు. ప్రపంచ దేశాల నుంచి దావోస్‌కు వచ్చిన పెట్టుబడి దారులను ఆకట్టుకోవటంతో చంద్రబాబు సంపూర్ణంగా సఫలమయ్యారన్నారు. వివిధ రంగాలకు చెందిన దాదాపు 15 ప్రపంచ అత్యున్నత వాణిజ్య సంస్థల అధిపతులతో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులకు ఇచ్చే ప్రోత్సాహకాలను తెలియజేశారన్నారు.

పారిశ్రామికవేత్తలకు భరోసా

- ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్



పొన్నూరుటౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): దావోస్ పర్యటన ద్వారా పారిశ్రామికవేత్తలకు కూటమి ప్రభుత్వం పెట్టుబడులు పెట్టడానికి పూర్తి భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం పొన్నూరులో జరిగిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్ పర్యటనపై వైసీపీ విమర్శలు విడ్డూరంగా ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు కూడా పూర్తికాక ముందే విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆదాని వద్ద రూ.1872 కోట్ల లంచం తీసుకున్నట్లు అమెరికా కోర్టులో కేసులు నమోదు కావటంతో అంతర్జాతీయంగా ఆంధ్రప్రదేశ్ పరువు పోగొట్టిన ఘనత జగన్ రెడ్డిదేనని స్పష్టం చేశారు. పారిశ్రామికంగా ఆంధ్రప్రదేశ్ ఎదుగుతుంది అనటంలో సందేహం లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

దావోస్ పర్యటనతో ప్రగతికి బాటలు

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి



చిలకలూరిపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో కూడిన బృందం దావోస్ పర్యటన విజయవంతం కావడంపై స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. బ్రాండ్ ఏపీని ప్రమోట్ చేయడంతో లక్ష్యం నెరవేరిందని చెప్పారు. ఓ వైపు వివిధ వర్గాల ప్రతినిధులతో చర్చలు జరుపుతూనే మరోవైపు రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి సన్ రైజ్ స్టేట్ బ్రాండ్ ను ప్రపంచస్థాయిలో ప్రమోట్ చేయడంలో చంద్రబాబు, లోకేశ్‌ల లక్ష్యం నెరవేరిందని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే నజీర్‌పై దాడి ఘటనలో ఐదుగురు అరెస్టు

- ఇద్దరిని అనకాపల్లిలో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ప్రధాన నిందితులైన సోదరులిరువురు రౌడీషీటర్లే

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ పై దాడికి సంబంధించిన ఘటనలో ఐదుగురు నిందితులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. కేసులో ప్రధాన నిందితులైన సయ్యద్ ఫైరోజ్, సయ్యద్ ఇంతియాజ్ అనే ఇరువురు సోదరులను అనకాపల్లిలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిరువురు రౌడీ షీటర్లు కావడం గమనార్హం. కాగా ఇదే కేసులో మిగిలిన నిందితులైన పాత గుంటూరుకు చెందిన మున్నా, ఐపీడీ కాలనీకి చెందిన నసీర్, ఆర్టీసీ కాలనీకి చెందిన రియాజ్‌ను గుంటూరులో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఒకటో డివిజన్లో గల ఆర్టీసీ కాలనీలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి వేడుకలు జరిగాయి. ఓ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు మొవ్వ శైలజ నిర్వహించిన ఈ కార్యక్రమానికి తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ హాజరు కాగా డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడైన సయ్యద్ ఇంతియాజ్, ఆయన సోదరుడైన నగర టీడీపీ ఉపాధ్యక్షుడు సయ్యద్ ఫైరోజ్ లు తమకు తెలియకుండా తమను పిలవకుండా ఈ కార్యక్రమానికి మీరు ఎలా వస్తారంటూ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్‌ను నిలదీశారు. దీంతో వివాదం ముదరడంతో ఫైరోజ్, ఇంతియాజ్ ఇరువురు ఎమ్మెల్యేపై దాడి చేశారు. మిగిలిన ముగ్గురు మున్నా, రోషన్, నజీర్‌లు కూడా ఎమ్మెల్యేతో పాటు కార్యక్రమం నిర్వాహకురాలు శైలజపై దాడికి ప్రయత్నించారు. ఈ ఘటనపై బాధితురాలు శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం పాతగుంటూరు పీఎస్ లో ఐదుగురు నిందితులపై కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో నిందితుల కోసం మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అయితే రౌడీ షీటర్లయిన సోదరులు ఫైరోజ్, ఇంతియాజ్‌లు అనకాపల్లిలో ఉన్నట్లు సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా పోలీసులు గుర్తించారు. దీంతో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అక్కడి పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడి నిందితులను వెంటనే అదుపులోకి తీసుకొనేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం గుంటూరు నుంచి ప్రత్యేక బృందం అనకాపల్లి వెళ్లి వారిరువురిని గుంటూరుకు తీసుకువస్తుంది. ఐదుగురు నిందితులను శనివారం కోర్టులో హాజరు పరచనున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	145.154.165
చికెన్ విత్ స్కిన్	280.00
చికెన్ స్కిన్ లెస్	290.00

నిరుద్యోగ యువతకు డీటీపీలో ఉచిత శిక్షణ

గుంటూరు విద్య జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డీటీపీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ జీవీ రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు 45 రోజులు పాటు శిక్షణ ఉంటుందని, శిక్షణా సమయంలో అభ్యర్థులకు ఉచిత భోజనం సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు తెల్లరేషన్ కార్డు, ఆధార్ నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, పదవ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన సర్టిఫికెట్‌తో కొత్తపేటలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణాభివృద్ధి సంస్థలో సంప్రదించాలి. ఇతర వివరాల కోసం యూనియన్ బ్యాంక్ గ్రామీణాభివృద్ధి సంస్థ, డోర్ నంబర్ 14-1-14, ఓల్డ్ బ్యాంకు స్ట్రీట్, కొత్తపేట గుంటూరు (9700687696)లో సంప్రదించాలని సూచించారు.

27న రానున్న గణపతి సచ్చిదానంద స్వామీజీ

గుంటూరు(తూర్పు), జనవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరం దత్తనాథ క్షేత్రం ఆశ్రమానికి ఈ నెల 27వ తేదీ సోమవారం పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ, ఉత్తరాధిపతి దత్త విజయానంద తీర్థ స్వామీజీ వార్లు రానున్నట్టు క్షేత్రం ట్రస్టీ బీ సీతారామిరెడ్డి తెలిపారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శుక్రవారం ఆహ్వానపత్రికల ఆవిష్కరించి, వివరాలు వెల్లడించారు. గణపతి సచ్చిదానంద స్వామీజీ 56 రోజులు విశ్వ ధర్మ ప్రచారం పేరుతో రాష్ట్ర పర్యటనలో భాగంగా 27న ఆశ్రమానికి వస్తున్నారని, 28న గోపూజ, శ్రీ చక్రార్చన, హోమం, అనంతరం స్వామీజీ వారిచే ఆంజనేయ రాగసాగర 'నాద ధ్యాన చికిత్సా కచేరి' ఉంటుందని వివరించారు.

ముఠా కార్మికులకు కూలీ రేట్ల జీవోను విడుదల చేయండి

గుంటూరు(తూర్పు), జనవరి 24(ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయిస్ ముఠా కార్మికుల కూలీరేట్ల జీవోని వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా స్థానిక పాతగుంటూరు, సివిల్ సప్లయిస్ గోడౌన్ల వద్ద కార్మికులు శుక్రవారం మెరుపు సమ్మె నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన్న ఆంజనేయులు మాట్లాడుతూ జీవోను వెంటనే విడుదల చేయలేని పక్షంలో నిరవధిక సమ్మెలో వెళ్తామని స్పష్టం చేశారు.

నేడు విద్యుత్‌సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా శనివారం శ్యామలానగర్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అలానే వినోబానగర్ శివాలయం, ఆంజనేయస్వామి ఆలయం, చెన్నం వారి వీధి, మారుతీనగర్, కమ్యూనిస్టు బొమ్మలు సెంటర్, బావాజీ మఠం, ఆలీనగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి పది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికకు 17 నామినేషన్లు



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు, పక్కన కనపర్తి శ్రీనివాసరావు తదితరులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ స్థాయీ సంఘ (స్టాండింగ్ కమిటీ) ఎన్నికకు 17 మంది కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేశారని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, స్టాండింగ్ కమిటి ఎన్నికల అధికారి చల్లా ఓబులేసు శుక్రవారం తెలిపారు. అదనపు కమిషనర్ మాట్లాడుతూ, నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు ఈ నెల 16న నోటిఫికేషన్ ఇచ్చామని, ఫిబ్రవరి 3న ఎన్నిక జరుగుతుందని తెలిపారు. 22 నుంచి 24 వరకు 17 మంది నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు. నామినేషన్లను ఈ నెల 27న ఉదయం 11 గంటల నుంచి స్క్రూట్నీ చేసి, అర్హత కల్గిన నామినేషన్లను ప్రకటిస్తామని తెలిపారు. నామినేషన్లను వరుసగా పోతురాజు సమత, కొమ్మినేని కోటేశ్వరరావు, దాసరి లక్ష్మీదుర్గ, తేలుకుట్ల హనుమాయమ్మ, ముప్పవరపు భారతి, నూకవరపు బాలాజీ, షేక్ మీరావలి, ఈరంటి వర ప్రసాద్, షేక్ రోషన్, యాట్ల రవికుమార్, అచ్చాల వెంకట రెడ్డి, అడకా పద్మావతి, రాజ లత బూసి, అంజలి మర్రి, పఠాన్ రిహాన, దూపాటి వంశీబాబు, గోపి శ్రీనివాస్‌లు దాఖలు చేశారని తెలిపారు.

ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలి

● యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ సయ్యద్ జవహర్



ఏటీఎమ్‌ను ప్రారంభిస్తున్న సయ్యద్ జవహర్, పాల్గొన్న సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్

గుంటూరు(తూర్పు), జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని, దానిని సాధించేందుకు కృషి చేయాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ సయ్యద్ జవహర్ అన్నారు. స్థానిక కుందుల రోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎమ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి కమ్మజనసేవ సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. అనంతరం జవహర్ మాట్లాడుతూ ఎన్టీఆర్, చంద్రబాబు వంటి వారు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి అనేక అద్భుతాలు సృష్టించారని, వారి స్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు. మార్కెటింగ్ మేనేజర్ హారిక మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు ఉన్నవారికి ముస్కాన్ అకౌంట్, 18 ఏళ్లు దాటిన వారికి యూనియన్ సమృద్ధి ఎకౌంట్ అందుబాటులో ఉన్నాయన్నారు. లక్ష్మీపురం, బృందావనగార్డెన్స్ బ్రాంచ్ మేనేజర్లు రాజేంద్ర కుమార్, రవికుమార్, కేజేఎస్ఎస్ కార్యదర్శి చుక్కపల్లి రమేష్, సభ్యులు మల్లెల హరేంద్ర నాథ్ చౌదరి, వీ బలరామ కృష్ణయ్య, వీ నాగేంద్రం, ఎం సీతారామయ్య, జీ కోటేశ్వరరావు, వీ శివరామ కృష్ణయ్య, పీసాంబశివరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు



ఏటీ అగ్రహారంలో పర్యటిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నగరంలో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ప్రత్యేకదృష్టితో ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక ఏటీ అగ్రహారం, అంకిరెడ్డిపాలెం, నలపాడు, సైనికపురి కాలనీ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించి, అభివృద్ధి పనులను పరిశీలించి, ఇంజినీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మెరుగైన మౌలిక వసతుల కల్పనకు జీఎంసీ అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. బిల్లుల చెల్లింపునకు ముందే చేపట్టిన అభివృద్ధి పనులను నేరుగా పరిశీలిస్తామన్నారు. పనుల్లో నాణ్యత లోపాలు గమనిస్తే సంబంధిత కాంట్రాక్టర్‌ని బ్లాక్ లిస్టులో ఉంచడంతో పాటు పర్యవేక్షణాధికారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తొలుత ఏటీ అగ్రహారం మస్టర్ పాయింట్‌ని పరిశీలించిన ఆయన, కార్మికుల, కార్యదర్శుల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. డివిజన్ పరిధిలో నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ, జీరో బ్లాక్ స్పాట్స్, తడిపొడి వ్యర్థాల విభజన జరిగేలా కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు సమన్వయంతో కృషి చేయాలన్నారు. పర్యటనలో డీఈఈ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్యతా సర్వేలు వేగవంతం చేయాలి

ప్రభుత్వ ప్రాధాన్యతా సర్వేలన్నింటిని వేగవంతం చేయాలని, నోడల్ అధికారులు కార్యదర్శులు చేస్తున్న సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అడ్మిన్ కార్యదర్శులు, నోడల్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో శుక్రవారం సచివాలయాల కార్యదర్శులు, నోడల్ అధికారులతో సర్వేల పై క్షేత్ర స్థాయిలో తలెత్తుతున్న సమస్యల పరిష్కారంపై సమావేశం నిర్వహించారు. తొలుత వివిధ సర్వేల నిర్వహణకు క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ఏవిధంగా అధిగమించాలో, సర్వే నిర్వహించు విధానం పై కార్యదర్శులకు, నోడల్ అధికారులకు వివరించారు. అనంతరం కార్యదర్శుల వారీగా మిస్సింగ్ సిటిజెన్స్, పీఎస్ఏస్ హౌసింగ్ జియో ట్యాగ్, ఎస్‌పీసీఐ, నాన్ రెసిడెంట్ ఇన్ ఏపీఎంఎస్ఎంఈ సర్వేల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాసులు మాట్లాడుతూ ఇకపై సర్వేలపై, సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తామని చెప్పారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటి కమీషనర్ డి. శ్రీనివారావు, సెక్రటరీ పి.శ్రీనివాసరావు, జెడ్‌పీ డిప్యూటీ సీఈఓ, డీసీ జీఎస్‌డబ్ల్యూఓ మోహన్‌రెడ్డి, ఆర్.ఓ రెహమాన్ పాల్గొన్నారు.

24 గంటల్లోనే వికలాంగుడి అర్జీ పరిష్కారం

వికలాంగులకు పెట్రోల్ మంజూరు నిమిత్తం ధ్రువీకరణ కోసం ఆర్ అగ్రహారం నివాసి వికలాంగుడు టీ బాలకృష్ణ అందించిన అర్జీని 24 గంటల్లోగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి సర్టిఫికెట్‌ని అందించామని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వయం ఉపాధి చేసుకుంటున్న బాలకృష్ణకు వికలాంగుల కోటాలో ప్రభుత్వం మంజూరు చేసిన 3 చక్రాల వాహనానికి పెట్రోల్ మంజూరు నిమిత్తం ధ్రువీకరణ పత్రం కోసం గురువారం సాయంత్రం అర్జీ అందించినట్లు చెప్పారు. సదరు అర్జీని క్షేత్ర స్థాయిలో పరిశీలించి 24 గంటల్లోనే సర్టిఫికెట్‌ని అందించామన్నారు. అర్జీ పరిష్కారంలో త్వరితగతిన స్పందించిన ఉపా సెల్ పీఓ రామారావుని ప్రత్యేకంగా అభినందించారు.

గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై జేసీ సమీక్ష

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను శనివారం సాయంత్రం నాటికి పూర్తి చేయాలని సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్‌తేజ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వ్యవసాయం, ఉద్యానవన, విద్య, వైద్య శాఖ, హౌసింగ్, ఆర్ డబ్ల్యూ ఎస్, డీఆర్డీఏ, మెప్మా, పంచాయతీ రాజ్, సివిల్ సప్లయిస్, జీయంసి, ట్రాన్స్ కో, ఐసీడీఎస్, అగ్నిమాపక శాఖల అధికారులతో మాట్లాడుతూ శకటాలను ఆకర్షణీయంగా రూపొందించి పరేడ్‌లో ప్రదర్శించేందుకు సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు ఉట్టిపడేలా స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. దేశభక్తిని ప్రతిబింబించే విధంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణకు డీఈఓ తగు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్ఓ షేక్ ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, ఆర్డీఓ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ జ్యోతిబసు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



గణతంత్ర వేడుకల నిర్వహణా ఏర్పాట్లపై సమీక్షిస్తున్న జేసీ భార్గవ తేజ, సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ కలెక్టర్, డీఆర్ఓ, డీఈఓ తదితరులు



డాక్టర్ సుందరాచారికి బంగారు పతకాన్ని అందజేస్తున్న ఐఎంఏ తెనాలిశాఖ అధ్యక్షుడు డాక్టర్ అనిల్ కుమార్, మధు ప్రభాకర్‌బాబు, బాబు ఆర్ వడ్లమూడి తదితరులు

డాక్టర్ సుందరాచారికి బంగారు పతకం

తెనాలి, మారీసుపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో అత్యుత్తమ వైద్యసేవలను అందించిన ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారికి బంగారు పతకాన్ని ఐఎంఏ సభ్యులు అంద జేశారు. స్థానిక బోసురోడ్డులోని ఐఎంఏ తెనాలి శాఖ కార్యాలయంలోని ఐఎంఏ హాల్‌లో శుక్రవారం తెనాలికి చెందిన ప్రవాస భారతీయ వైద్యులు డాక్టర్ సీతారామమ్మ వడ్లమూడి మెమోరియల్ స్మారక ఎండో మెంటు గోల్డు మెడల్‌ను గుంటూరు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ సుందరాచారికి తెనాలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ అనిల్ కుమార్, కార్యదర్శి డాక్టర్ జి మధు ప్రభాకర్‌బాబు, డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడి అందజేశారు. ఈ సందర్భంగా సుందరాచారి మాట్లాడుతూ ఈ గోల్డ్ మెడల్‌ను తాను అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. స్పెక్ట్రమ్ ఆఫ్ మూమెంట్ డిజార్డర్స్‌పై స్మారకోపన్యాసం చేసి విధానాలు, చికిత్సల గురించి వైద్యులకు అవగాహన కల్పించారు.

డాక్టర్ రవితేజకు ఉత్తమ వైద్య పరిశోధన అవార్డు



డాక్టర్ రవితేజకు అవార్డు అందజేస్తున్న వైద్యులు

గుంటూరు మెడికల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ లోని హైటెక్స్‌లో ఇటీవల జరిగిన భారత శిశు వైద్యనిపుణుల సంఘం (ఐఏపీ) 62వ జాతీయ సదస్సులో గుంటూరులోని శ్రీరామ చంద్ర పిల్లల, దంత వైద్య శాలకు చెందిన డీఎన్‌బీ పీడియాట్రిక్ విద్యార్థి డాక్టర్ మేడా రవితేజ సమర్పించిన పరిశోధన ప్రథమ స్థానంలో నిలిచింది. డాక్టర్ వీ బాలగోపాల్ రాజు ఎండోమెంట్ అవార్డును కైవశం చేసు కుంది. 'ఐఏపీ, డబ్ల్యూహెచ్‌వో కంబైన్డ్ గ్రోత్ చార్ట్స్, ఈజ్ దేర్ ఈ నీడ్ ఫర్ రివిజన్?' అనే అంశంపై డాక్టర్ రవితేజ తన వైద్యపరిశోధన పత్రం సమర్పించారు. గత మూడు దశాబ్దాల కాలంలో గ్రోత్ ఛార్ట్స్ ప్రకారం పిల్లల ఎత్తు క్రమేపీ పెరుగుతున్నట్లు ఈ పరిశోధనాపత్రంలో వివరించారు. తల్లిదండ్రుల ఎత్తుతో పోలిస్తే 35 శాతం మంది పిల్లల్లో ఎత్తు మైల్డ్ పేరెంటల్ హైట్ (ఎంపీహెచ్) కన్నా ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. దీనికి జన్యుపరమైన కారణాలతో పాటు పౌష్టికాహారం, సామాజిక, ఆర్థికపరిస్థితులు, వాతావరణ ప్రభావం వంటి పలు కారణాలు ఉన్నట్లు వివరించారు. రవితేజ తన పరిశోధన నిమిత్తం గుంటూరు శ్రీరామచంద్ర పిల్లల ఆసుపత్రిలో రెండేళ్ల పాటు ఐదు నుంచి 15 ఏళ్లలోపు వయస్సు కలిగిన 700 మంది పిల్లలపై అధ్య యనం చేశారు. తన పరిశోధన అంశాన్ని దృష్టిలో ఉంచుకొని భారత వైద్య నిపుణుల సంఘం, ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పందించి పిల్లల గ్రోత్ చార్ట్స్‌లో మార్పులు చేయాలని కోరారు. అవార్డు సాధించిన రవితేజను, శ్రీరామచంద్ర పిల్లల దంత వైద్యశాల అధినేతలు డాక్టర్ టీ చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ వీ సరస్వతి అభినందించారు.



గెలుపొందిన జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న భాష్యం రామకృష్ణ

కొనసాగుతున్న భాష్యం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

గుంటూరు (విద్య)జనవరి 24 (ఆంధ్ర జ్యోతి): స్థానిక గోరంట్లలోని భాష్యం రామసేతు క్యాంపస్‌లో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు కొనసాగు తున్నాయి.శుక్రవారం ఉదయం క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్‌లో హైదరాబాద్ హైలాండర్స్-2 జట్టుతో ఈస్ట్ గోదావరి ఎంపరర్స్-2 జట్టు తలపడగా హైదరాబాద్ హైలాండర్స్-2 జట్టు విజ యం సాధించింది. పోటీల్లో గెలుపొందిన జట్టుకు ఛైర్మన్ భాష్యం రామకృష్ణ ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్య రామకృష్ణ, వైస్ ఛైర్మన్ భాష్యం హనుమంతరావు, భాష్యం విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

'కాంపిటెన్సీ బూస్టర్' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు (విద్య) జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నేటి ప్రపంచాన్ని మార్చడంలో విద్య శక్తిమంతమైన పరికరంగా పని చేస్తుందని భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామ కృష్ణ అన్నారు. మెయిన్ క్యాంపస్‌లో ఏబీపీ పబ్లికేషన్ కాంపి టెన్సీ బూస్టర్ పుస్తకాన్ని రామ కృష్ణ, ఎండీ సాకేత్ రామ్ చేతులమీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏబీపీ పబ్లికేషన్ సీఈఓ యష్ మెహతా, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ గుడిబండి శశిలతో రామకృష్ణ, సాకేత్ రామ్ భేటీ అయ్యారు. ప్రస్తుత విద్యా విధానాల్లో వస్తున్న మార్పులపై చర్చించారు.

పొన్నూరు ఎస్ఐపై సస్పెన్షన్ వేటు

● ముగ్గురు కానిస్టేబుళ్ల బదిలీ

● న్యాయవాదిని కొట్టిన ఘటనపై ఎస్పీ చర్యలు

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పొన్నూరులో న్యాయవాది బేతాళం ప్రకాశరావును కొట్టిన ఘటనలో ఎస్ఐ రాజ్‌కుమార్‌ను సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఎస్పీ సతీష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా ఈ ఘటనతో ప్రమేయం ఉన్న మరో ముగ్గురు కానిస్టేబుళ్ళను వేరే స్టేషన్‌కు బదిలీ చేశారు. గత కొన్ని రోజుల క్రితం పొన్నూరు పట్టణంలో ఎస్ఐ రాజ్‌కుమార్‌కి, న్యాయవాది ప్రకాశరావుకి మధ్య జరిగిన ఘటనకు సంబంధించి డీఎస్పీతో ప్రాథ మిక విచారణ జరిపించారు. ఈ విచారణ ఆధారంగా పోలీస్ శాఖ క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తూ ఎస్ఐను ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా ఈ ఘటనలో ఎస్సైతో పాటు విధుల్లో ఉన్న ముగ్గురు కానిస్టేబుళ్లను కూడా పొన్నూరు నుంచి వేరే పోలీస్‌స్టేషన్లకు బదిలీ చేశారు.

సీసీఎస్ పోలీసుల ప్రమేయంతో నేరాల దర్యాప్తు వేగవంతం: ఎస్పీ సతీష్ కుమార్

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : సీసీఎస్ పోలీసుల ప్రమేయంతో నేరాల దర్యాప్తు వేగవంతమవుతుందని ఎస్పీ సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఆయన జిల్లా క్రైమ్ పోలీస్ స్టేషన్‌ని తనిఖీ చేశారు. నేరాల దర్యాప్తు, నేరస్తుల గుర్తింపు, నేరాల స్వభావం, చోరీకి గురైన సొమ్ము రికవరీ తీరు, మొదలగు వివిధ అంశాల గురించి ఆరా తీసి, నేరాల దర్యాప్తులో పాటించాల్సిన మెళకువలను సీసీఎస్ పోలీస్ అధికారులు, సిబ్బందికి ఆయన వివరించారు.తనిఖీలో క్రైమ్స్ జిల్లా అదనపు ఎస్పీ సుప్రజ, సీసీఎస్ డీఎస్పీ శివాజీ రాజు, సీఐలు సుబ్బారావు, అనురాధ తపాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి: డీఎంహెచ్‌వో

గుంటూరు మెడికల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది తప్పనిసరిగా సమయ పాలన పాటిస్తూ క్రమం తప్పకుండా ఎఫ్ఆర్ఎస్ నమోదు చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మీ ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శుక్రవారం పట్టణ పీహెచ్‌సీ కేంద్రాల వైద్యాధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉద్యోగానికి సంబంధించి ఆర్థిక లావాదేవీలు, సమస్యలు ఉంటే సంబంధిత ప్రోగ్రామ్ ఆఫీసరుల దృష్టికి తీసుకెళ్లాలని ఆమె సూచించారు. 143 జీవో పద్దు కింద ఖాళీగా ఉన్నపోస్టుల వివరాలను తనకు అందజేయాలని తెలిపారు. కుష్టు నివారణ విభాగం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్ మాట్లాడుతూ జిల్లాలో లెప్రసీ సర్వేలో నాణ్యత ఉండాలని అన్నారు. జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఏటీ రఘునాథరావు మాట్లాడుతూ డెంగీ కేసులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ శ్రావణ్ బాబు, డాక్టర్ సీహెచ్ రత్నమన్మోహన్, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ రోహిణి రత్నశ్రీ, డాక్టర్ లక్ష్మానాయక్, డీఎంవో సుబ్బరాయణం, డీఎంఓ కొండారెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థినులతో డాక్టర్ షమా సుల్తానా

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● డాక్టర్ షమా సుల్తానా సూచన

గుంటూరు మెడికల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బాలికల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని హోప్ విన్ హాస్పిటల్స్ ఛైర్‌పర్సన్, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తానా పిలుపునిచ్చారు. స్థానిక సంగడిగుంటలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలో (మైనార్టీ బాలికల) శుక్రవారం జరిగిన జాతీయ బాలికల దినోత్సవంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. బాలికల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ప్రతి ఏటా జనవరి 24న జాతీయ బాలికల దినోత్సవం జరుపుకుంటున్నట్లు షమా సుల్తానా తెలిపారు. మహిళా, శిశు సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. వరల్డ్ కేన్సర్ డే పురస్కరించుకొని ఫిబ్రవరి 4న గుంటూరు నమస్తే సొసైటీ ఆధ్వర్యంలో 50 మంది పేద ఆడపిల్లలకు సర్వైకల్ కేన్సర్ నివారణకు ఖరీదైన హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఉచితంగా వేస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్య, పోషకాహారం, బాల్య వివాహాలు, చట్టపరమైన హక్కుల గురించి, వైద్య సంరక్షణ గురించి వివరించారు.

ఆటో రంగాన్ని పరిశ్రమగా గుర్తించాలి

గుంటూరు(తూర్పు), జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆటో రంగాన్ని పరిశ్రమగా గుర్తించి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో శుక్రవారం ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా 8వ మహాసభలు జరిగాయి. సభలకు యూనియన్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభు త్వం ఇచ్చిన హామీ మేరకు బ్యాడ్జీతో సంబంధం లేకుండా ప్రతి ఆటో కార్మికునికి ఏడాదికి రూ 15 వేలు, 50 ఏళ్లు నిండిన వారికి రూ.10 వేలు అందజేయాలని, సొంత ఆటో కొనుగోలు చేయడానికి ప్రతి కార్మికుడికి పావలా వడ్డీకే రుణాలు మంజూరు చేయాలని, ఆటో కార్మికుల పిల్లలకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలని,ఈ-చలానాలను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మేడా హనుమంతరావు, కోట మాల్యాద్రి, ఆకిటి అరుణ్ కుమార్, మంగా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న చేనేత కార్మికులు, సంఘ నాయకులు

చేనేత కార్మికులను ఆదుకోవాలంటూ నిరసన

గుంటూరు(తూర్పు),జనవరి 24(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులను అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టా శివదుర్గారావు కోరారు. స్థానిక అంబేద్కర్ భవన్ వద్ద ఉన్న జిల్లా చేనేత, జౌళి కార్యాలయం ఎదుట శుక్రవారం కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ చేనేతపై జీఎస్టీ విధించడంతో ఆ రంగం సంక్షోభంలో పడిందని అన్నారు. జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, 200 యూనిట్ల ఉచిత కరెంటు అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఆహామీని నెర వేర్చాలని కోరారు. చేనేతకు రూ.2 వేల కోట్లు కేటాయించి, మగ్గం చేస్తున్న ప్రతి కార్మికుడికి నేతన్న నేస్తం ఇవ్వాలన్నారు. పట్టు జారీ నూలు ధరలు తగ్గించి, 40 శాతం రిబేట్ కొనసాగించాలన్నారు. చేనేత కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, సంఘాల అప్పులను రద్దు చేయాలన్నారు.



సచివాలయ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జీఏడీ ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా

ప్రజాస్వామ్యానికి మూల స్తంభం ఓటు: ఎంకే మీనా

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యానికి మూల స్తంభం ఓటు అని రాష్ట్ర సాధారణ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి (పొలిటికల్) ముఖేశ్ కుమార్ మీనా అన్నారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో ఆయన ఉద్యోగులతో ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ పౌరులుగా, ఓటరుగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. గత ఎన్నికల్లో దేశంలోనే అత్యధికంగా రాష్ట్రంలో ఓటింగ్ శాతం 80కిపైగా నమోదు చేసి రికార్డు సృష్టించాం. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఎక్కువ సార్లు ఓటు హక్కు వినియోగించుకున్న సీనియర్ ఓటర్లను, ఓటు హక్కు వినియోగ ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే వారినీ ప్రత్యేకంగా సత్కరించుకుంటున్నాం' అని మీనా పేర్కొన్నారు.

గణతంత్ర వేడుకలకు గిరిజన అతిథిగా గురునాథం

న్యూఢిల్లీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 76వ గణతంత్ర వేడుకలకు ప్రత్యేక గిరిజన అతిథిగా హాజరుకావాలని టీడీపీ నాయకుడు, మాదిగాని గురునాథంకు కేంద్రప్రభుత్వం నుంచి ఆహ్వానం అందింది. గణతంత్ర వేడుకలకు హాజరుకావడానికి ఢిల్లీ చేరుకున్న ఆయన శుక్రవారం ప్రధాని మోదీని ఆయన నివాసంలో ఇతర గిరిజన అతిథులతో పాటు కలిశారు.

'విత్తన ధ్రువీకరణ' ఉన్నతాధికారులపై ఏసీబీకి ఫిర్యాదు

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా లాంలోని రాష్ట్ర విత్తన ధ్రువీకరణ అథారిటీలోని ఇద్దరు ఉన్నతాధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి ఫిర్యాదులు వెళ్లాయి. వీరు ఆదాయాన్ని మించి భారీగా ఆస్తులు కూడగట్టారని పలువురు ఏసీబీకి లేఖ రాసినట్లు తెలిసింది. విత్తన ధ్రువీకరణ అధికారులుగా పనిచేస్తున్న ముగ్గురికి పదోన్నతులు కల్పించినందుకు రూ.లక్షల్లో ముడుపులు పుచ్చుకున్నారని సమాచారం. 'విత్తన క్షేత్రాలు, విత్తన నాణ్యత, విత్తన, పరిశోధన ఫలితాల విషయంలో నెలవారీ మామూళ్లు తీసుకుంటున్నారు. ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులు, కొత్త సిబ్బంది నియామకాల్లో ముడుపులు తీసుకుంటున్నారు. వాహనాల కొనుగోలు, కార్యాలయ నిర్వహణ వ్యయంలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. దీనిపై కౌంటర్ వేయకుండా, ముడుపులు పుచ్చుకుని, కొనసాగిస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది 25మందిలో ఐదుగురిని పర్మినెంట్ చేసే ప్రయత్నాలు చేయగా, బోర్డు మీటింగ్‌లో బెడిసికొట్టింది. సంస్థ వాహనాన్ని హైదరాబాద్‌లో కీలక అధికారి కుటుంబ సభ్యులు వాడుతుంటే, ఏపీలో ఉపయోగిస్తున్నట్లు లాగ్‌బుక్‌లో రాస్తున్నారు. మరో ఉన్నతాధికారి తాత్కాలిక ఉద్యోగిగా చేరి అంచెలంచెలుగా ఎదిగి, ఉద్యోగాన్ని అడ్డం పెట్టుకుని, అక్రమాలకు పాల్పడుతున్నారు' అని ఏసీబీ డైరెక్టర్‌తోపాటు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

'ఫెర్రో'కు తగ్గించిన విద్యుత్ సుంకం కొనసాగింపు

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ నుంచి యూనిట్‌కు ఆరు పైసలు చొప్పున వసూలు చేస్తున్న విద్యుత్ సుంకాన్ని కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వు జారీ చేసింది. గతంలో యూనిట్‌కు 10 పైసలు చొప్పున వసూలు చేస్తున్న సుంకాన్ని ఆరు పైసలకు తగ్గించారు. ఆ తగ్గింపు సుంకాన్నే మరో ఏడాది కొనసాగించాలన్న ఫెర్రో ఎల్లాయిస్ అసోసియేషన్ అభ్యర్థన మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ పరిశ్రమపై 30,000 మంది ఉద్యోగులు వారి కుటుంబాలూ ఆధారపడి ఉన్నాయని ఉత్తర్వులో పేర్కొన్నారు. వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొనే ఈ నిర్ణయం తీసుకున్నామని ఉత్తర్వులో వివరించారు.



గణతంత్ర వేడుకలకు ముస్తాబైన సచివాలయ భవనాలు

గాడిలో గ్రామీణాభివృద్ధిశాఖ!

సంస్కరణల బాట పట్టించాలని నిర్ణయం

- పంచాయతీరాజ్ తరహాలో ప్రక్షాళన చేసే యోచన
- ఉద్యోగుల పదోన్నతులు, జీతాల వ్యత్యాసాలపై దృష్టి
- వేతనాలు పెంచేందుకు పక్కాగా మార్గదర్శకాలు
- ఎప్పటికప్పుడు సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు
- ఉపముఖ్యమంత్రి ఆదేశాలతో కసరత్తు ప్రారంభించిన అధికారులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పంచాయతీరాజ్‌శాఖలో ప్రక్షాళన ప్రారంభించిన ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిశాఖలోనూ సంస్కరణలు తీసుకురావాలని యోచిస్తోంది. తొలుత ఉద్యోగుల పదోన్నతులు, జీతాల వ్యత్యాసాలపై దృష్టి పెట్టాలని భావిస్తున్నారు. వేతనాలు పెంచేందుకు మార్గదర్శకాలు పక్కాగా రూపొందించాలని నిర్ణయించారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో గ్రామీణాభివృద్ధిశాఖను అస్తవ్యస్తం చేశారు. ప్రధానమైన ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేశారు. వాటర్‌షెడ్ లాంటి పథకాల నిధులు ఏమయ్యాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్నింటినీ గాడిలో పెట్టే ప్రయత్నాలు ప్రారంభించారు. సమస్యల పుట్టగా ఉన్న గ్రామీణాభివృద్ధిశాఖను కచ్చితంగా సంస్కరించాల్సిన అవసరముందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్ణయించారు. ఆయన ఆదేశాలతో ఇప్పటికే కమిషనర్ కృష్ణతేజ ఉన్నతాధికారులతో సంప్రదించి గ్రామీణాభివృద్ధి శాఖలో సమస్యలపై ఒక కమిటీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఉన్నతస్థాయిలో దానిపై ప్రస్తావన జరిగినట్లు సమాచారం.



పెరగని జీతాలు, దక్కని పదోన్నతులు..

గ్రామీణాభివృద్ధిశాఖలో పథకాలన్నీ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందితోనే అమలు చేస్తున్నారు. అధికారులను డిప్యుటేషన్ ద్వారా తీసుకున్నారు. కేంద్ర పథకాలైన ఉపాధి, వాటర్‌షెడ్ తదితర వాటిల్లో రాష్ట్రంలో సుమారు 3 వేల మందికి పైగా మండల, జిల్లా స్థాయి సిబ్బంది ఏళ్ల తరబడి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి లోకేశ్ హయాంలో పెంచిన జీతాలు తప్ప గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం వారికి జీతాలు పెంచలేదు. నిత్యావసర ధరలు పెరిగిన నేపథ్యంలోనూ ఉద్యోగాలు భారంగానే కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. 2016-17లో అప్పటి కమిషనర్ రామాంజనేయులు ఉపాధి సిబ్బందికి పదోన్నతుల ప్రక్రియ చేపట్టారు. ఆ తర్వాత ఆ ఊసే లేదు. గత టీడీపీ ప్రభుత్వం ఆఖరులో ఉపాధి సిబ్బందికి హెల్త్‌కార్డులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నా.. ఆ తర్వాత వైసీపీ సర్కార్ దానిని పట్టించుకోలేదు. గత ప్రభుత్వంలో స్థానిక నేతల ఒత్తిడితో ఉపాధి హామీ పథకంలో జరిగిన అడ్డగోలు బదిలీలతో సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇక గత ప్రభుత్వంలో చేసిన పనులకు సంబంధించి ఇప్పుడు సోషల్ ఆడిట్ నిర్వహిస్తుంటే దొంగలెక్కలన్నీ బయటపడుతున్నాయి. అప్పట్లో పనులు లేకుండా మస్టర్లు వేసినందుకు ఇప్పుడు రూ.లక్షలు రికవరీలు వస్తున్నాయి. కొన్ని చోట్ల సిబ్బందిపై కేసులు కూడా నమోదు చేస్తున్నారు. లేని పనులకు అప్పట్లో ఒత్తిడి చేసి మస్టర్లు వేయించారని, ఇప్పుడు తమను కాపాడేవారు లేరని సిబ్బంది వాపోతున్నారు.

సంస్కరణలు చేపడితేనే పథకం ముందుకు..

గ్రామీణాభివృద్ధిశాఖలో సమూల సంస్కరణలు చేపడితేనే గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు సజావుగా సాగుతాయని ఆ శాఖ ఉన్నతాధికారుల్లో చర్చ జరిగింది. ఈ సందర్భంగా వారు మరిన్ని అంశాలను ప్రస్తావించినట్లు తెలిసింది. "ఒక నిర్దిష్ట విధానంలో నియామకాలు చేపట్టడంతో పాటు బదిలీలకు కూడా కొత్త మార్గదర్శకాలు రూపొందించాలి. బదిలీల్లో వీలైనంత వరకు రాజకీయ జోక్యం లేకుండా చేయాలి. ఏటా జీతాలు పెంచడంతో పాటు పీఆర్సీకి అనుగుణంగా వేతనాలు మార్చాలి. సోషల్ ఆడిట్‌కు సంబంధించి సిబ్బందిని జవాబుదారీ చేయడంలో మరిన్ని మార్పులు తీసుకురావాలి. ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకంలోనూ మార్పులు చేయాలి. సిబ్బంది అర్హతలను బట్టి పదోన్నతులు కల్పించాలి. ఒకే తరహా ఉద్యోగుల్లో ఉన్న వేతనాల వ్యత్యాసాన్ని సరిచేయాలి. సిబ్బందికి ఆరోగ్య భద్రత కల్పించాలి. రిటైర్మెంట్ వయసును 62కు పెంచాలి. గ్రాట్యుటీ లాంటి ఇతర ప్రయోజనాలను అందించాలి. సిబ్బందికి మెరుగైన శిక్షణ ఇవ్వడం ద్వారా పనులు నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తవుతాయి" అని వారు పేర్కొన్నారు.



గణతంత్ర ఏర్పాట్లు.. బైక్‌లపై ఫీట్లు

గణతంత్ర వేడుకల నిర్వహణకు వాల్తేరు రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. వేడుకలకు నగరంలోని రైల్వే ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ గ్రౌండ్‌లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్సు (ఆర్పీఎఫ్) ముమ్మర సాధన చేస్తోంది. దీనిలో భాగంగా శుక్రవారం ద్విచక్ర వాహనాలపై ఆర్పీఎఫ్ సిబ్బంది విన్యాసాలు చేశారు.

-విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

ఆలయ పాలకవర్గాల నియామకంపై కసరత్తు

- టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులతో పల్లా టెలీ కాన్ఫరెన్స్

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాలకు పాలకమండళ్ల నియామకంపై టీడీపీ కసరత్తు చేపట్టింది. అర్హతలకు అనుగుణంగా ఈ మండళ్లలో ధర్మకర్తల నియామకానికి ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం సాయంత్రం ఈమేరకు ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో కలిపి సుమారు 500 ఆలయాలకు పాలక మండళ్లను నియమించాల్సి ఉంది. వీటి భర్తీకి దేవదాయ శాఖ కొన్ని అర్హతలు నిర్దేశించింది. టెలీ కాన్ఫరెన్స్‌లో ఈ అర్హతలను అన్నింటిని పల్లా శ్రీనివాసరావు చదివి వినిపించారు. వీటిని దృష్టిలో ఉంచుకొని ఒకటి రెండు రోజుల్లో తమ ప్రతిపాదనలను పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపాలని ఆయన వారిని కోరారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీల పాలక వర్గాలకు ఇంకా కొన్ని నియోజకవర్గాల నుంచి ప్రతిపాదనలు అందకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆ నియోజకవర్గాల జాబితాను ఆయన చదివి వినిపించారు. ఇవి సుమారుగా 50 వరకూ ఉన్నాయి. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, జిల్లా సహకార మార్కెటింగ్ సంస్థలకు పాలక వర్గాల నియామకంపై కూడా ఇన్‌చార్జి మంత్రులతో ఎమ్మెల్యేలు చర్చించాలని, ఆలస్యం చేయవద్దని ఆయన వారికి సూచించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

వేసవికి విడుదల



బాలీవుడ్ హీరో సన్నీ డియోల్ హీరోగా గోపిచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'జాట్'. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, టీజీ విశ్వప్రసాద్ నిర్మాతలు. ఈ చిత్రం ఏప్రిల్ 10న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ మేరకు నిర్మాతలు రిలీజ్ డేట్ పోస్టర్ విడుదల చేశారు. ఇందులో సన్నీ డియోల్ ఇంటెన్స్ యాక్షన్-ప్యాక్డ్ అవతార్‌లో కనిపించారు. భుజంపై రాకెట్ లాంచర్‌తో ఆగ్రహంగా ముందుకు అడుగులేస్తున్న సన్నీ డియోల్ లుక్ అదిరిపోయింది. మొత్తానికి పోస్టర్‌లో ఈ చిత్రంలో రణదీప్ హుడా, వినీత్ కుమార్ సింగ్, సయామీ ఖేర్, రెజీనా కాసాండ్రా కీలక పాత్రలు పోషిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రంలోని యాక్షన్ సన్నివేశాలు, కొరియోగ్రఫీ ప్రేక్షకులను కట్టిపడేస్తాయని నిర్మాతలు తెలిపారు.

బాలయ్య సరసన సంయుక్త

నందమూరి బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న భారీ ప్రతిష్ఠాత్మక చిత్రం 'అఖండ 2.. తాండవం'. ఈ సినిమాలో కథానాయికగా సంయుక్త మీనన్‌ను ఎంపిక చేసినట్లు నిర్మాతలు రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట చెప్పారు. హీరోయిన్లను అద్భుతమైన పాత్రల్లో చూపించే బోయపాటి శ్రీను సంయుక్త కోసం ఓ కీలక పాత్ర సిద్ధం చేశారు. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకొనే ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం జరుగుతోంది. ఈ సినిమాకు ఎస్. థమన్ సంగీత దర్శకుడు. సి.రామ్ ప్రసాద్ ఛాయాగ్రాహకుడు. ఈ ఏడాది సెప్టెంబర్ 25న విజయదశమి సందర్భంగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.



దోమకొండ కోటలో ప్రియాంక చోప్రా

కామారెడ్డి జిల్లాలోని దోమకొండ గడికోటలో శుక్రవారం ప్రముఖ నటి ప్రియాంక చోప్రా సందడి చేశారు. తెల్లవారుజామున 2 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఆమె గడి కోటలో ఉన్నారు. ఈ సందర్భంగా అక్కడి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కోట తరఫున సిబ్బంది తీర్థప్రసాదాలు అందజేశారు. కోట సీనియర్ మేనేజర్ బాబ్జి హీరోయిన్‌కు జ్ఞాపికను అందజేశారు. అద్దాల బంగ్లా, సొరంగ మార్గం, చుట్టూ కందకం, కోట చరిత్రను వివరించారు. ప్రియాంక చోప్రా గతంలో రాంచరణ్‌తో 'జంజీర్' సినిమాలో నటించారు. ఆయన శ్రీమతి ఉపాసన ఈ కోటకు వారసురాలు అనే విషయం తెలిసిందే. ప్రియాంక చోప్రా దోమకొండకు వచ్చిందన్న విషయం తెలుసుకున్న స్థానికులు ఉదయమే కోట వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఆమెను చూసేందుకు ఎగబడ్డారు.

దోమకొండ (ఆంధ్రజ్యోతి)



యశ్ చిత్రంలో నయనతార



యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతా మోహన్ దాస్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'టాక్సిక్'. ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రాజెక్టు మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు నటీనటుల గురించి ప్రకటించలేదు. కానీ బాలీవుడ్ నటుడు అక్షయ్ ఒబెరాయ్ ఇందులో నటిస్తున్నాడంటూ మేకర్స్ ఆ మధ్య ఓ పోస్టర్ వదిలారు. మరోవైపు 'టాక్సిక్' హీరోయిన్ ఈమె నంటూ సోషల్ మీడియాలో ఎంతో మంది కథానాయికల పేర్లు చక్కర్లు కొట్టాయి. అయితే ఈ ప్రాజెక్టులో నయనతార భాగమైనట్లు బాలీవుడ్ నటుడు అక్షయ్ ఒబెరాయ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ప్రస్తుతం తాను యశ్ సినిమా షూటింగ్‌లో ఉన్నానని, దీనిలో నయనతార కూడా నటిస్తున్నారని, ఇంతకు మించి నేనేమీ చెప్పలేనని, పూర్తి సమాచారాన్ని డైరెక్టర్ గీతూ మోహన్ దాస్ ప్రకటిస్తారని అక్షయ్ ఒబెరాయ్ చెప్పారు. అయితే నయనతార ఏ పాత్రలో కనిపించనున్నారనే దానిపై ఆయన స్పష్టతనివ్వలేదు. కాగా ఈ చిత్రంలో బాలీవుడ్ కథానాయిక కియారా అద్వాణీ ప్రత్యేక గీతంలో నర్తించనున్నారని సమాచారం.

లాస్ ఏంజెలెస్‌లో షూట్ చేస్తాం



'ఫాస్ట్ ఎక్స్ 2' చిత్రం మిగిలిన షూటింగ్‌ను లాస్ ఏంజెలెస్‌లో జరపనున్నట్లు హాలీవుడ్ హీరో విన్‌డీజిల్ ప్రకటించారు. లాస్ ఏంజెలెస్‌లోని పలు ప్రాంతాలను కార్చిచ్చు దహించివేసిన నేపథ్యంలో ఆ నగరం కోసం తనవంతుగా ఏదైనా చేయాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా తెలిపారు. 'ఇప్పుడు లాస్ ఏంజెలెస్‌కు మన అవసరం మరింత ఉంది. 'ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్' ఫ్రాంచైజీలో తొలి చిత్రం షూటింగ్ 25 ఏళ్ల క్రితం ఇక్కడే మొదలైంది. మళ్లీ ఇప్పుడు ఆ నగరంలో 'ఫాస్ట్ ఎక్స్ 2' సినిమా షూటింగ్ చేయబోతున్నందుకు ఆనందంగా ఉంది. నటి జోర్దానా సూచనతో ఈ నిర్ణయం తీసుకున్నాను. లాస్ ఏంజెలెస్‌లో పరిస్థితులు కుదుటపడ్డాక చిత్రీకరణ ప్రారంభిస్తాం' అని తెలిపారు. ఈ ఫ్రాంచైజీలో వస్తున్న చివరి చిత్రం ఇదే. వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. లూయిస్ లెటెర్రీర్ దర్శకత్వం వహిస్తున్నారు.

నాన్న మాటే నా జీవన మంత్రం

\- షబానా



'సినిమా దర్శకులకు స్వేచ్ఛ ఉండాలి, అదే సమయంలో సామాజిక బాధ్యత కూడా చాలా ముఖ్యం' అని బాలీవుడ్ నటి షబానా అజ్మీ వ్యాఖ్యానించారు. అలా అని ప్రతి సినిమా సందేశాత్మకంగా ఉండాలి అన్న వాదన కూడా సరికాదన్నారు. చలనచిత్రానికి వినోద విలువలు కూడా అవసరం అన్నారు. షబానా అజ్మీ సినీ స్వర్ణోత్సవం సందర్భంగా హైదరాబాద్ సాహిత్య మహోత్సవం వేదికగా 'ఎ లైఫ్ ఇన్ సినిమా - షబానా అజ్మీ' అంశంపై అమితా దేశాయ్ ఆధ్వర్యంలో చర్చాగోష్ఠి జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హైదరాబాద్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఇక్కడే పుట్టి, తొమ్మిదో ఏట వరకు ఉన్న తాను తర్వాత కాలంలోనూ వేసవి సెలవులకు నగరానికి వస్తుండేదాన్నని చెప్పారు. సమాజంలో మార్పు కోసం పనిచేస్తున్న క్రమంలో నిరాశ చెందకుండా, నిబద్ధతతో ముందుకెళ్లడాన్నే తాను విశ్వసిస్తానని షబానా చెప్పారు. మార్పు ఒక్క రోజులో వచ్చేది కాదు, కనుక మనం చేసే పని ఇప్పటికిప్పుడు ఫలితాలను ఇవ్వలేకపోవచ్చు. కానీ రేపటినాడు జరిగే మార్పునకు దోహదపడుతుందని తన తండ్రి కైఫీ అజ్మీ చెప్పిన మాటలే తనకు జీవిత సూత్రమని, వాటినే ఆచరిస్తూ ముందుకు సాగుతున్నానని షబానా అజ్మీ తెలిపారు.

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)

ఇక వెంకటలచ్చిమి అని పిలుస్తారేమో!

పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్రలో తెరకెక్కనున్న చిత్రం 'వెంకటలచ్చిమి'. ముని దర్శకత్వంలో రాజా, ఎస్ఎస్ చౌదరి నిర్మించనున్న ఈ సినిమా శుక్రవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ముని మాట్లాడుతూ 'కథ అనుకున్నప్పుడే పాయల్ రాజ్‌పుత్ సరిపోతారనిపించింది. పాన్ ఇండియా సినిమాగా తెలుగుతో పాటు హిందీ, పంజాబీ భాషల్లో తెరకెక్కిస్తున్నాం. ఈ రివెంజ్ డ్రామా భారతీయ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టించడం ఖాయం' అని అన్నారు. హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ "మంగళవారం' సినిమా తర్వాత ఎన్నో కథలు విన్నాను. నచ్చక తిరస్కరించాను. ఈ సినిమా తర్వాత నా పేరు వెంకటలచ్చిమిగా స్థిరపడిపోతుందేమో అన్నంతగా బలమైన సబ్జెక్టు ఇది' అని అన్నారు.



తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

రౌడీషీటర్ అరెస్టు

తెనాలి అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడిపై దౌర్జన్యం చేసిన రౌడీషీటర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఐతానగర్‌కు చెందిన రౌడీషీటర్ నూతలపాటి అరుణ్ పట్టణంలోని ప్రకాశం రోడ్డులో సమోసా పాయింట్ నడుపుకుంటున్న శ్రీరామ్‌రాజుతో స్నేహం చేశాడు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై అతనిని డ్రాప్ చేసే విషయంలో మద్యం మత్తులో దాడి చేసి గాయపరిచాడు. గాయపడిన రాజు చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరి పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ రాంనాయక్ తెలిపారు.

వెంకటకృష్ణాపురంలో విద్యార్థిపై ఉపాధ్యాయురాలి దాష్టీకం


విద్యార్థి ఒంటిపై కనిపిస్తున్న వాతలు

పెదకాకాని, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండలంలోని వెంకటకృష్ణాపురంలో ఓ ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయురాలు విద్యార్థిని చితకబాదిన సంఘటన శుక్రవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. వెంకటకృష్ణాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని దేవరాయపట్ల పాలెం గ్రామానికి చెందిన కనపర్తి సురేష్ బాబు కుమారుడు మహీధర్ అనే విద్యార్థి వెంకటకృష్ణాపురంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. ఆ పాఠశాలకు చెందిన టీచర్ బాలుడిని బెత్తంతో చితకబాదడంతో బాలుడు ఒంటిపై వాతలు తేలాయి. ఈ సంఘటనపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని బాలుడి తల్లిదండ్రులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

రేపు జంతువధ నిషేధం

తెనాలి, మారీసుపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలో ఈ నెల 26వ తేదీ ఆదివారం రిపబ్లిక్ డే సందర్భంగా జంతువధ నిషేధించామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. పట్టణంలోని మాంసం, చేపలు విక్రయించే దుకాణదారులు, కబేళాను మూసివేయాలన్నారు. హోటళ్లు రెస్టారెంట్లలో నాన్‌వెజ్ వినియోగించరాదని ఇందుకు భిన్నంగా ప్రవర్తించిన వారిపై ఆంధ్రప్రదేశ్ ప్రజారోగ్య చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

27న మండల పరిషత్ సమావేశం

తెనాలి రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 27న నిర్వహిస్తున్నట్లు ఈవోపీఆర్డీ వైవీడీ ప్రసాద్ తెలిపారు. ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవుల అధ్యక్షతన ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. సభ్యులు, సదరు అధికారులు, సిబ్బంది పాల్గొనాలని ప్రకటనలో పేర్కొన్నారు.

కోటప్పకొండ స్థల పురాణంపై లఘుచిత్రం

తెనాలి అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కోటప్పకొండ స్థల పురాణంపై ఓటీటీ కోసం లఘు చిత్రంను శుక్రవారం తెనాలిలో చిత్రీకరించారు. సినీ దర్శకుడు దిలీప్‌రాజా పర్యవేక్షణలో జానపద నటుడు నరసింహరాజుపై పలు సన్నివేశాలు చిత్రీకరించారు. దర్శకులు దిలీప్‌రాజా మాట్లాడుతూ, పేద భక్తులు ఇంటికి శివయ్య వచ్చే సన్నివేశాలను చిత్రీకరించామని తెలిపారు. మహాశివరాత్రికి కోటప్పకొండకు లక్షలాది మంది భక్తులు తరలి రావడానికి విశేషమైన స్థల పురాణం అందమైన దృశ్యకావ్యంగా రూపొందిస్తున్నామన్నారు. సహ దర్శకులు నరేష్, మణివరన్‌లు సన్నివేశాలను చిత్రీకరించారు.

పొన్నూరు రూరల్ సీఐపై చర్యలు తీసుకోవాలి

● ఐజీకి హైకోర్టు న్యాయవాది ఫిర్యాదు

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పచ్చలతాడిపర్రుకు చెందిన తమలపాకుల జయంతి అనే మహిళ కేసులో పోలీస్‌స్టేషన్‌లో చట్ట విరుద్ధంగా ప్రైవేట్ పంచాయతీ చేసిన పొన్నూరు రూరల్ సీఐ కోటేశ్వరరావుపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు న్యాయవాది జొన్నలగడ్డ దివాకర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన గుంటూరులో రేంజ్ ఐజీ త్రిపాఠీని కలిసి ఫిర్యాదు చేశారు. జయంతికి తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూర్‌కు చెందిన సెంథిల్ కుమార్‌కు మధ్య నెలకొన్న వివాదంపై ఆమె ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పొన్నూరు రూరల్ పోలీసులు నిందితులపై చర్యలు తీసుకోలేదన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ప్రైవేట్ పంచాయతీ చేసి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకున్నారని ఆయన ఐజీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అడిషనల్ డీజీ మధుసూదన్ రెడ్డి కూడా ఫిర్యాదు పంపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

● మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్

తెనాలి, మారీసుపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి రావు అన్నారు. శుక్రవారం స్థానిక ఐతానగర్‌లోని ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్‌లో విద్యార్థుల అటెండెన్స్ సర్వే (డ్రాప్ ఔట్ సర్వే)ను మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి రావు నిర్వహించారు. అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు మెడల్స్‌తో అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సునీత, డ్రాయింగ్ మాస్టర్ వెంకట్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ

పురపాలక సంఘ పరిధిలోని 1వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని శుక్రవారం మున్సిపల్ అసిస్టెంట్ మున్సిపల్ కమీషనర్ లక్ష్మీపతిరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుధ్య కార్మికుల హాజరును పరిశీలించారు. అనంతరం పట్టణంలోని 7, 9వ వార్డులలో జరుగుతున్న పనులను పరిశీలించారు.

బుర్రిపాలెంలో నిలిచిన అభివృద్ధి పనులు

● గత వైసీపీ ప్రభుత్వంలో సచివాలయం, రైతు సేవా కేంద్రం నిర్మాణం
● అసంపూర్తిగా సచివాలయ భవన నిర్మాణం
● అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారిన భవనం
● పెమ్మసాని, మనోహర్ దృష్టి పెట్టాలని గ్రామస్థుల వినతి


చివరి దశలో పనులు నిలిచిపోయిన సచివాలయ భవనం

తెనాలి రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్వగ్రామం.. మాజీ ఎంపీ గల్లాజయదేవ్ అత్తగారిల్లు కూడా ఇదే గ్రామం.. సూపర్ స్టార్ కృష్ణ పుట్టిన గడ్డ ప్రిన్స్ మహేష్‌బాబు దత్తత గ్రామం కూడా బుర్రిపాలెమే. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాభివృద్ధికి సచివాలయం, రైతుసేవా కేంద్రాల నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ ద్వారా పనులు కూడా చేపట్టారు. సచివాలయ భవనం అన్ని హంగులతో రెండు అంతస్తులలో పూర్తికాగా రైతు సేవా కేంద్రం పిల్లర్ల దశకు చేరింది. మరికొన్ని రోజుల్లో వాటి సేవలు ప్రారంభమవుతాయనుకున్న తరుణంలో ప్రభుత్వ భూమి కాస్త ప్రైవేటు భూమి అంటూ స్థానికులు కోర్టును ఆశ్రయించారు. రూ.లక్షలతో నిర్మాణాలు పూర్తిచేసుకున్న భవన నిర్మాణం పూర్తి అవుతున్న తరుణంలో తమ స్థలమంటూ పనులు ఆపించడంతో గ్రామాభివృద్ధికి అడ్డుకట్టపడింది. కోర్టులో ఉందన్న సాకుతో అధికారులు సైతం ఆభవనాన్ని పరిశీలించిన దాఖలాలు కూడా లేకపోవడంతో అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారి స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. అన్నీ సవ్యంగా జరిగి ఉంటే ఇప్పటికే ఆ రెండు కేంద్రాల ద్వారా ప్రజలకు మేలు జరిగేది. అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో ప్రజాధనం నిరుపయోగంగా మారిందని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. భూమికి సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో పక్కాగా ఉంటేనే అక్కడ ప్రభుత్వ భవన నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుంది. కానీ అధికారుల వైఖరితో భవన నిర్మాణ స్థలం వ్యవహారం వివాదాస్పదమైంది. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌లు ప్రత్యేక శ్రద్ధచూపి అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలిస్తే గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించినవారవుతారని గ్రామపెద్దలు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


పిల్లర్ల దశలో నిలిచిపోయిన ఆర్బీకే కేంద్ర భవననిర్మాణం

బలహీనవర్గాలకు అండగా నిలిచిన పరిటాల రవీంద్ర

గణేష్‌యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి

తెనాలి రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆనాడు రాయలసీమలో అరాచకాలకు, ఆకృత్యాలకు సింహస్వప్నంగా, బడుగు బలహీన వర్గాలకు కొండంత అండగా దివంగత పరిటాల రవీంద్ర నిలబడి ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచారని గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ నేత వీరవల్లి మురళి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద దాసరి రమణ, పరిటాల అభిమానుల ఆధ్వర్యంలో మాజీమంత్రి పరిటాల రవీంద్ర వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీరవల్లి మురళి పాల్గొని పరిటాల రవీంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ పేదల ఇంటికి పెద్దదిక్కుగా పరిటాల నిలబడి లక్షల్లో ఆడబిడ్డల పెళ్లిళ్లు జరిపించి మనసున్న మనిషిగా వారి మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఎన్టీఆర్ పిలుపుతో రాజకీయాల్లోకి వచ్చి జెల్లోఉండి నామినేషన్‌వేసి ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలుపొందిన ఏకైక నాయకుడు దివంగత పరిటాల రవీంద్ర అన్నారు.


తెనాలిలో పరిటాల రవీంద్ర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీరవల్లిమురళి, నిర్వాహక సభ్యులు


పెదకాకానిలో పరిటాల రవి, వీరయ్య చౌదరి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

ఆయన మృతిచెందిన రెండు దశాబ్దాలు దాటినా ఇప్పటికి స్మరించుకోవడం ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనమన్నారు. వైఎస్ ప్రభుత్వంలో 2005లో పరిటాలను హత్యచేసి హతమార్చారని ఆయన లేని లోటును ఎవ్వరూ పూడ్చలేనిదన్నారు. కార్యక్రమంలో మంగమూరి యుగంధర్, కోగంటి గిరి, శ్రీనివాసరావు, నరసయ్య, మంగమూరి లలితేంద్ర, చెన్నుపాటి శ్రీను, ఎ.శివచంద్రశేఖర్, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

● పెదకాకాని: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రులు ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి, పరిటాల రవీంద్రల వర్ధంతి వేడుకలు పెదకాకానిలో శుక్రవారం ఘనంగా జరిగాయి. పెదకాకాని మండలం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రవి, వీరయ్య చౌదరిల చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక చైతన్యం కలిగించే రచనలు రావాలి

రచయిత్రి ఓల్గా


కథా సంకలనం పరిచయ సభలో మాట్లాడుతున్న రచయిత్రి ఓల్గా

తెనాలి అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సామాజిక చైతన్యం కలిగించే రచనలు రావాలని, నేటి సమాజానికి అవి ఎంతో అవసరమని స్త్రీవాద రచయిత్రి ఓల్గా చెప్పారు. సాహితీ సాంస్కృతిక వేదిక భిన్నస్వరాలు ఆధ్వర్యంలో శుక్రవారం కవిరాజా పార్కులో యోధా పుస్తక పరిచయ సభ నిర్వహించారు. బండారు విజయ రచించిన కథా సంకలనాన్ని సమీక్షించారు. జీఎస్ నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ, సామాజిక సవాళ్లను ఆత్మస్థైర్యంతో ఎదుర్కొన్న యోధుల జీవిత గాథలను రచయిత్రి సమాజానికి అందించారన్నారు. 53మంది పాత, కొత్త రచయిత్రుల భిన్న వ్యక్తీకరణలను కథల్లో స్పష్టమయ్యాయని, చినుకు సంపాదకుడు నండూరు రాజగోపాల్, మరో స్త్రీవాద రచయిత్రి ఎం.హైమావతి పాల్గొన్నారు.

నెహ్రూనికేతన్ స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శన

తెనాలి అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నెహ్రూనికేతన్ స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శనను ఎండీ మురళీకాంత్ శుక్రవారం ప్రారంభించారు. వివిధ పాఠ్యాంశాలలో నిర్వహించిన పలు నమూనాలను విద్యార్థులు రూపొందించి ప్రదర్శించారు. విద్యార్థులు రూపొందించిన నమూనాలను సందర్శకులకు వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కాటా ప్రమీల

బాలికల విద్యపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

● డాక్టర్ కాటా ప్రమీల

కొల్లిపర, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బాలికల విద్యపై తల్లిదండ్రులు ప్రత్యే శ్రద్ధ చూపాలని డాక్టర్ కాటా ప్రమీల అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు చిట్రా వెంకట్రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కాటా ప్రమీల మాట్లాడుతూ బాల్యవివాహాల వలన అనేక అనర్థాలకు గురికావాల్సి వస్తోందన్నారు. డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోవాలన్నారు. బాలురతో సమానంగా బాలికలను చదివించాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఈదా సాంబిరెడ్డి, రాయపాటి శివనాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ప్రశాంతరావు, వెంకటభూపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: పట్టణంలోని పలు ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. కొత్తపేటలోని మున్సిపల్ బాలిక ఉన్నత పాఠశాలలో బాలికలకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సౌజన్యశ్రీ బహుమతులు అందజేశారు. బాలికలతో వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహార అంశాలపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. పదో తరగతిలో ఉత్తమ విద్యార్థిని జానకీలక్ష్మిని సత్కరించారు. హెచ్‌ఎం నాగమ్మ, బసవమ్మ తదితరులు పాల్గొన్నారు. చెంచుపేట కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్‌లో బాలికా సాధికారత కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో భద్రత, గౌరవం కల్పించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను హెచ్‌ఎం రాజారెడ్డి వివరించారు. సూపర్‌వైజర్ నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● తెనాలి రూరల్: ఆడపిల్లలను చిన్నచూపు చూడకుండా వారిని మంచి విద్యావంతులుగా తీర్చిదిద్ది సమాజంలో ఉన్నత స్థాయికి తీసుకువెళ్దామని కొలకలూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి పొన్నెకంటి జయదేవ్ చెప్పారు. శుక్రవారం మండలంలోని కొలకలూరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవంలో భాగంగా బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమానికి ఆయన పాల్గొని తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. గ్రామ సచివాలయ మహిళా పోలీసులు జి. ప్రగతి, ఎం.మల్లికలు మహిళా సంరక్షణ చట్టాలపై వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ హిమబిందు మాట్లాడుతూ బాల్యవివాహాల ద్వారా ఏర్పడే ఇబ్బందులను వివరించి వాటిని ప్రోత్సహించవద్దని కోరారు. అంగన్వాడీ టీచర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ అవకతవకలపై అధికారుల తనిఖీ


ఉపాధిహామీ రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా పరిషత్ అధికారులు

కొల్లిపర, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో మున్నంగి, కొల్లిపర, తూములూరు గ్రామాల్లో 2018-19, 2020-22వ సంవత్సరంలో ఉపాధి హామీ పనులకు సంబంధించిన మెటీరియల్ కొనుగోలులో అవకతవకలు జరిగాయని దుగ్గిరాల మండలం తుమ్మపూడి గ్రామానికి చెందిన కూరపాటి చైతన్యకుమారి జిల్లా కలెక్టర్‌కు లోకాయుక్తలో ఫిర్యాదు చేయడంతో శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ ఏవో శామ్యూల్ పాల్, అకౌంటెంట్ నాగమల్లేశ్వరరావు రికార్డులను తనిఖీ నిర్వహించారు. నాలుగు సంవత్సరాల్లో సుమారుగా 47లక్షల రూపాయల వ్యయం జరిగినట్లు తెలిపారు. రికార్డులు పరిశీలించి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందించనున్నట్లు ఏవో సామ్యూల్‌పాల్ తెలియజేశారు. అప్పట్లో విధులు నిర్వహించిన ఎంపీడీవో విజయలక్ష్మణ్, ఏపీవోలు శివనాగమల్లేశ్వరరావు, విజయకుమార్, నాగరాజు విచారణకు హాజరై రికార్డులను జిల్లా పరిషత్ అధికారులకు అందజేశారు.


డాక్టర్ సుందరాచారికి బంగారు పతకాన్ని అందజేసిన ఐఎంఏ తెనాలిశాఖ అధ్యక్షుడు డాక్టర్ అనిల్ కుమార్, మధు ప్రభాకర్‌బాబు, బాబు ఆర్ వడ్లమూడి తదితరులు

డాక్టర్ సుందరాచారికి బంగారు పతకం

తెనాలి, మారీసుపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో అత్యుత్తమ వైద్య సేవలను అందించిన న్యూరాలజిస్ట్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారికి బంగారు పతకాన్ని ఐఎంఏ సభ్యులు అందజేశారు. స్థానిక బోసురోడ్డులోని ఐఎంఏ తెనాలి శాఖ కార్యాలయంలోని ఐఎంఏ హాల్‌లో శుక్రవారం తెనాలి పట్టణానికి చెందిన ప్రవాస భారతీయురాలు డాక్టర్ సీతారామమ్మ వడ్లమూడి మెమోరియల్ స్మారక ఎండోమెంటు గోల్డు మెడల్‌ను గుంటూరు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారికి తెనాలి శాఖ అధ్యక్షులు డాక్టర్ అనిల్ కుమార్, కార్యదర్శి డాక్టర్ జి మధు ప్రభాకర్ బాబు, డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడిలు అందజేశారు. స్పెక్ట్రమ్ ఆఫ్ మూమెంట్ డిజార్డర్స్‌పై స్మారకోపన్యాసం చేసి విధానాలు, చికిత్సల గురించి వైద్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్‌లు శ్యామ్‌ప్రసాద్, పవని ప్రియాంక, పాటిబండ్ల దక్షిణామూర్తి, చందు సాంబశివుడు, వేమూరి శేషగిరిరావు ఘంటా నరసింహారావు, డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావుకు సంఘీభావం తెలుపుతున్న ఉపాధ్యాయులు, పెన్షనర్లు

గ్రాడ్యుయేట్ల ఉపాధి కల్పనకు కృషి

● ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావు

తెనాలి అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్లకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తానని కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ నియోజకవర్గ పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు చెప్పారు. కొత్తపేట ఎన్జీవో హోమ్‌లో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, నిరుద్యోగ యువత మద్దతు ఇవ్వాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా కోశాధికారి గయాసుద్దౌలా అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, సహాధ్యక్షురాలు కుసుమకుమారి, సీఐటీయూ నాయకులు బాబుప్రసాద్, భావన్నారాయణ, హనుమంతరావు, కళాధర్, రాజశేఖర్, మల్లేశ్వరరావు, ములకా శివసాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, టీడీపీ కౌన్సిలర్ అరుణ తదితరులు

పంట కాలువలో వ్యర్థాలను వేయకండి

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పంట కాలువలలో వ్యర్థాలను వేయరాదని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. శుక్రవారం పట్టణంలోని 27, 28వ వార్డులలో జరుగుతున్న శానిటేషన్ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంలో చైర్‌పర్సన్ రాధిక పంట కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను, ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లను గమనించి వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు ప్రజలు తమ ఇంటి నుంచి వచ్చే చెత్తను వ్యర్థాలను మురుగు కాలువలలో డ్రెయిన్‌లలో వేయరాదని దానివలన చెత్త పేరుకుపోయి మురుగునీటి పారుదలకు ఆటంకం ఏర్పడుతుందన్నారు. మురుగు కాలువలను, డ్రెయిన్లను ఆక్రమించి ర్యాంపులను నిర్మించరాదన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు బోయపాటి అరుణ, యాతాటి అనిల్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, టీపీవో సాంబశివరావు, ఏఈ సునీల్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నూరు ఎస్ఐ సస్పెన్షన్

● ముగ్గురు కానిస్టేబుళ్ళపై బదిలీ వేటు

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పొన్నూరులో న్యాయవాది బేతాళం ప్రకాశరావును కొట్టిన ఘటనలో ఎస్ఐ రాజ్‌కుమార్‌ను సస్పెండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. అదేవిధంగా ఈ ఘటనతో ప్రమేయం ఉన్న మరో ముగ్గురు కానిస్టేబుళ్ళను వేరే స్టేషన్‌కు బదిలీ చేశారు. గత కొద్ది రోజుల క్రితం పొన్నూరు పట్టణంలో ఎస్ఐ రాజ్‌కుమార్‌కి, న్యాయవాది ప్రకాశరావుకు మధ్య జరిగిన ఘటనకు సంబంధించి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ డీఎస్పీతో ప్రాథమిక విచారణ జరిపించారు. డీఎస్పీ ప్రాథమిక విచారణ ఆధారంగా ఎస్ఐ రాజ్ కుమార్‌ను పోలీస్ శాఖ క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా ఈ ఘటనలో ఎస్సైతో పాటు విధుల్లో ఉన్న ముగ్గురు కానిస్టేబుళ్లను క్రమశిక్షణ చర్యల్లో భాగంగా పొన్నూరు పట్టణం నుంచి వేరే పోలీస్‌స్టేషనన్లకు బదిలీ చేశారు.

13వ వార్డులో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్

తెనాలి, మారీసుపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 13వ వార్డులో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ అవగాహన కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ కుర్రా సుజాత అధికారులతో కలసి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా వార్డు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజలు చెత్తను రోడ్లపై వేయరాదని ఇంటి వద్దనే పారిశుధ్య కార్మికులకు అందించాలని కోరారు. మూడు బుట్టల విధానంలో పొడిచెత్త, తడిచెత్త, ప్రమాదకర వ్యర్థాలను వేరువేరుగా అందించాలని సూచించారు. అనంతరం వార్డులో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనుపమ, ఎన్.ప్రవీణ్, చంద్రశేఖర్, సాగర్, సంధ్య, శాంతి, నగరదీపిక జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ముగ్గురికి గోల్డ్‌మెడల్

తెనాలి అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో ఐతానగర్ ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్‌లో ముగ్గురు విద్యార్థులకు గోల్డ్ మెడల్ లభించింది. మహారాష్ట్రలోని సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ గత నవంబరులో నేషనల్ లెవల్ టాలెంట్ సెర్చ్ కాంపిటీషన్ నిర్వహించింది. రంగోలి విభాగంలో 70మంది విద్యార్థులు చిత్రాలను వేసి ఆన్‌లైన్‌లో సంస్థ నిర్వహిస్తున్న పోటీలకు పంపారు. వీరిలో ముగ్గురు విద్యార్థులు మన్యం బదిరీనాథ్, సానాకౌసల్ పఠాన్, పిల్లి ఐశ్వర్యలు ఎ-1గా విన్నర్స్ సాధించారు. కళారంగ అవార్డులతో పాటు గోల్డ్‌మెడల్ పంపారు. పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి విద్యార్థులు అభినందించి సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు.

పారదర్శకంగా సదరం సర్టిఫికెట్ల పరిశీలన

● వైద్యశాల సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి


వైద్యశాలలో సదరం రీ వెరిఫికేషన్‌పై సిబ్బందితో మాట్లాడుతున్న సౌభాగ్యవాణి

తెనాలి రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పింఛన్లు పొందుతున్న లబ్ధిదారుల సదరం సర్టిఫికెట్లు పునః పరిశీలనను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి చెప్పారు. గత రెండు రోజులుగా జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. శుక్రవారం సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిజమైన అర్హుల వివరాలను పరీక్షల అనంతరం నమోదుచేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంరక్షణలో అవగాహన కలిగి ఉండాలి

● పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి

తెనాలి రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పశువుల పోషణలో పాడి రైతులు తగిన శ్రద్ధచూపితే అవి ఆరోగ్యంగా ఉంటూ మంచి పాల దిగుబడిని ఇస్తాయని రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోగలరని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి చెప్పారు. శుక్రవారం మండలంలోని కంచెర్లపాలెం, మల్లెపాడు గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్యశిబిరాన్ని అసిస్టెండ్ డైరెక్టర్ డాక్టర్ నాగిరెడ్డితో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పలు పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఇరు గ్రామాల సర్పంచ్‌లు, పశువైద్యులు మీనాక్షి, అనూష, అబ్దుల్‌ముజీర్ పాల్గొన్నారు.

● కొల్లిపర: రైతులు పశువులపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి సాయిసతీష్‌రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని మున్నంగి, చక్రాయపాలెం గ్రామాల్లో ఉచిత పశు శిబిరాన్ని పశువైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయిసతీష్‌రాజు మాట్లాడుతూ పశుసంవర్ధకశాఖ సేవలను పశుపోషకులకు మరింత చేరువచేయడానికి పశుఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పశువైద్యాధికారులు పశువులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వేమూరి దీనమ్మ, చందు బాబురావు, పశువైద్యాధికారులు జయశ్రీ, సుజాత, నవ్య పాల్గొన్నారు.

యువ క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

తెనాలి అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): యువ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రతిభగల క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు డైరెక్టర్ హరిదాసు గౌరీశంకర్ తెలిపారు. చెంచుపేటలోని అకాడమీలో 2025-26 సంవత్సరానికిగాను ఐదుగురు క్రీడాకారులను ఎంపిక చేస్తామని ఈ నెల 26న ఎంపికలు జరుగుతాయని చెప్పారు. ఎంపికైనవారికి ఏడాదిపాటు ఉచిత క్రికెట్ కోచింగ్, స్కాలర్‌షిప్, కిట్ అందజేస్తామన్నారు. ఆసక్తిగలవారు ఎంపికకు హాజరుకావాలని, వివరాలకు కోచ్ మాలిక్ నెం.7989215572లో సంప్రదించాలని కోరారు.

నేడు లేమల్లెపాడుకు ఎమ్మెల్యే రామాంజనేయులు రాక

వట్టిచెరుకూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లేమల్లెపాడులో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. నూత నంగా నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయినేజ్ నిర్మాణాలను ఆయన ప్రారంభించనున్నారు. ఎంపీపీ పాఠశాల ప్రాంగణంలో భారీ ఎత్తున వివిధ రకాల మొక్కలు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొననున్నారు.

2న కృష్ణారివర్ క్రాస్ ఈత పోటీలు

తాడేపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి కరకట్ట వద్ద ఉన్న ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న 25వ కృష్ణా రివర్ క్రాస్ ఈత పోటీలు జరుగుతాయని నిర్వాహకులు, అధ్యక్షుడు వెలగపూడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి మం దపాటి లక్ష్మీనరసరాజు, ఈవెంట్ కన్వీనర్ దాసరి యుగంధర్ శుక్రవారం ఓ ప్రకటన లో తెలిపారు. రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 31 ఆఖ రు తేదీ అని, రూ.500 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని చెప్పారు. విజయవాడ దుర్గా ఘాట్ నుంచి ప్రకాశం బ్యారేజి చివర వున్న లోటస్ ఫుడ్ సిటి వరకు 1.5 కిలోమీటర్లు కృష్ణా రివర్ క్రాస్ ఈత పోటీలు జరుగుతా యన్నారు. వివరాలకు 90147 54679 నెంబరులో సంప్రదించాలని కోరారు.

16 నుంచి సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణ

తాడేపల్లి టౌన్, జనవరి 24 (ఆంధ్ర జ్యోతి): వచ్చే నెల 16 నుంచి ఉచిత సాఫ్ వేర్ కోర్సు శాప్ ఎస్‌డీలో శిక్షణ నిర్వహించ నున్నట్లు మానవ సేవా సంస్థ వ్యవస్థాపకు డు వంగర సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శని, ఆదివారాలు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిక్షణ ఉంటుందని, డిగ్రీ చదివిన వారు అర్హులని, కోర్సు కాల పరిమితి మూడు నెలలన్నారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లా విద్యార్థినీ విద్యార్థులకు మంగళగిరిలో క్లాసులు నిర్వ హించనున్నట్లు వివరించారు. కృష్ణా, ఎన్టీఆర్, పశ్చిమగోదావరి జిల్లాల విద్యార్థులకు అవ కాశం ఉంటుందని, వివరాలకు 93937 71663 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఫోరం ఫర్ ఆర్టీఐ క్యాలెండర్ ఆవిష్కరణ

మంగళగిరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఫోరం ఫర్ ఆర్టీఐ ఏపీ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండ ర్లను మంగళగిరిలోని రాష్ట్ర సమాచార కమి షన్ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో సమాచార కమి షన్ రాష్ట్ర కమిషనర్లు ప్రత్తిపాటి శామ్యూల్ జోనాథన్, రావెల సునీల్, రెహానా, సుబ్రహ్మ ణ్యం రెడ్డి, ఎఫ్ఆర్టీఐ జాతీయ అధ్యక్షుడు ప్రత్తిపాటి చంద్రమోహన్, జాతీయ ఉపాధ్యక్షుడు మట్టా ప్రసాద్, విక్టర్‌పాల్, పీ.అశోక్‌కుమార్, కొండేటి చందు, మురళీ, రామకృష్ణ, కే.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లకై ఉద్యమిస్తాం

మంగళగిరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల చట్టం కోసం వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలను కలుపుకుని దేశ వ్యాపితంగా ఉద్యమిస్తామని సోషలిస్టు కూటమి జాతీయ చైర్మన్ ఎల్. జైబాబు చెప్పారు. మంగళగిరి ఐబీఎన్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన అవకాశాల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ప్రాధాన్య త దక్కడంలేదని తెలిపారు. ఈ సదస్సులో ఆర్టీఐ జాతీయ అధ్యక్షుడు పత్తిపాటి చంద్ర మోహన్, పందిపాటి అశోక్, కాసాని గణేష్ బాబు, రామకృష్ణ, పొదిలి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ ఓటరు దినోత్సవం

తుళ్లూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జాతీ య ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఐనవోలు పరిధిలోని వీఐటీ(వేలూ రు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)ఏపీ విశ్వవి ద్యాలయంలో అవగాహ కార్యక్రమం, ఓటరు నమోదు నిర్వహిస్తున్నట్టు తుళ్లూరు మండల రెవెన్యూ అధికారి సుజాత శుక్ర వారం తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు నమోదుకు అర్హులన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడేపల్లి టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యో తి): విద్యుత్ లైన్ల అత్యవసర మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి 1 గం ట వరకు ఉండవల్లి సెంటర్, రామకృష్ణ హాల్ ఏరియా, జామ్ ఆయిల్ తోట, సాయి నగర్ కట్ట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సర ఫరాలో అంతరాయం ఏర్పడనుందని డీఈఈ జీ సురేష్‌బాబు తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

మంగళగిరి సిటీ, జనవరి 24 (ఆంధ్ర జ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను స్థానిక టీడీపీ నాయ కులు శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల మండల టీడీపీ అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, మంగళగిరి పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, ఎంపీటీసీ విశ్వనాథపల్లి శివకుమార్, సర్పంచ్ ఉమాదేవి, నేతలు వంగర రమేష్, దివి లక్ష్మి, గంటా దుర్గాప్రసాద్, బూదాటి శ్రీను, కొల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో కలర్ బెల్ట్ టెస్ట్ పోటీలు

మంగళగిరి సిటీ (కాజ), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం కాజ గ్రామంలోని ఈగల్ మార్షల్ ఆర్ట్స్ క్లబ్‌లో శుక్రవారం తైక్వాండో కలర్ బెల్ట్ టెస్ట్ పోటీలు నిర్వహించినట్టు తైక్వాండో నేషనల్ రిఫరీ, కోచ్ చిల్లపల్లి నరేంద్ర తెలిపారు. మంగళగిరికి చెందిన యూ.ధనుష్ రెడ్ బెల్టు, ఈ.లిఖిత్, డి.సోమహర్ష ఎల్లో-1, బి.జస్విత, బి.భువన్, డి.జస్వీత, డి.సాయి కార్తీక్, ఎస్.జైశ్రీకర్‌రెడ్డి, బి.లిఖిల్ రెడ్డి, ఎస్.మోక్షిత్ రెడ్డి, ఎన్.నేహశ్రీ, ఈ.ధీరజ్, బి.ఇషిత ఎల్లో బెల్టులు సాధించినట్టు తెలిపా రు. ప్రతి ఒక్కరూ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవ డం ద్వారా ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యం పెంపొందుతుందని, విద్యార్థులకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందని కోచ్ నరేంద్ర తెలిపారు.

రెండు నెలల గడువిస్తే.. పంట చేతికొస్తుంది

- మంత్రిని కోరిన రైతులు, రైతు కూలీలు
- గతంలో ఉపాధి లేదు కౌలు ఇవ్వలేదు
- జీవనం కోసం సీఆర్‌డీఏ భూముల్లో పంటలు వేశాం
- రాజధాని పనుల పేరిట దున్నకుండా చూడాలని వినతి


మంత్రి నారాయణతో మాట్లాడుతున్న పైర్లు వేసిన రైతులు, రైతు కూలీలు

తుళ్లూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రెండు నెలల సమయం ఇస్తే, పంట చేతికొస్తుందని, ఆ తర్వాత తామే స్వచ్ఛందంగా తొలగిస్తామని పురపాలక శాఖ మంత్రి నారాయణను పైర్లు వేసిన రైతులు కోరారు. కోర్ క్యాపిటల్ ప్రాంతంలో ప్రభుత్వ కాంప్లెక్స్ టవర్ల పునాదులలో నీళ్ల తొలగింపు పనులను నారాయణ శుక్రవారం పరిశీలించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను రైతులు కలిశారు. వైసీపీ హయాంలో రాజధాని నిర్మాణపుపనులు పూర్తిగా నిలిపివేయడంతో కూలీలకు ఉపాధి లేదని, రైతులకు వార్షిక కౌలు ఇవ్వలేదని, దీంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో చేసేది లేక జీవనం కోసం సీఆర్డీఏ భూములలో అక్కడక్కడా పంటలు వేసుకున్నట్లు తెలిపారు. ఆ పంటలను ఇప్పుడు రాజధాని పనులు మొదలవుతున్నాయని దున్నేస్తున్నారని, రెండు నెలల సమయం ఇస్తే, తమ పంట చేతికొస్తుందని వివరించారు. ఆ తర్వాత రాజధాని పనులు ముమ్మరం అవుతాయని, పంటలు వేసే పని ఉండదని, తమకు ఉపాధి దొరకుతుందని, పనులకు అడ్డంగా పంట ఉంటే అప్పటికప్పుడే తొలగిస్తామని, అంత వరకూ సమయం ఇవ్వాలని మంత్రిని కోరారు. అందుకు నారాయణ సానుకూలంగా స్పందించారు. టెండరు ప్రక్రియ పూర్తి అయిన తరువాత పనులు మొదలు పెట్టినప్పుడు ఎక్కడైనా పంట అడ్డు వస్తే తొలగించక తప్పదని రైతులకు మంత్రి తెలిపారు. అందాక అడ్డురాని పైర్లు తొలగించబోమని, ఇకపై ఆయా భూముల్లో పంటలు వేస్తే నష్ట పోతారని రైతులకు తెలిపారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి

- టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అద్దంకి శ్రీధర్


బార్నీని ప్రారంభిస్తున్న టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్

పెదనందిపాడు,(ఉప్పలపాడు) జనవరి, 24 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలని టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అద్దంకి శ్రీధర్ అన్నారు. మండల పరిధిలోని ఉప్పలపాడులో ఉత్తమ రైతు పెంట్యాల హరిబాబు నూతన విధానంలో నిర్మించిన పొగాకు బార్నీలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఆధునిక టెక్నాలజీతో నిర్మించిన బార్నీ వలన కూలీల కొరత అధిగమించడంతో పాటు పెట్టుబడి వ్యయం తగ్గుతుందన్నారు. పొగాకుబోర్డు అనుమతలు మేరకే రైతులు పంట సాగు చేస్తారని, నేరుగా రైతుల వద్ద నుండే బోర్డు ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. తొలుత పరిటాలవారిపాలెంలోని పొగాకు పైర్లను ఆయన పరిశీలించారు. అయన వెంట కార్యదర్శి డీ వేణుగోపాల్, మేనేజర్ జీ దామోదరరావు, ఆర్ఎం లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి పరిటాల రవి : ఎమ్మెల్యే రామాంజనేయులు


పరిటాల విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

వట్టిచెరుకూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పేదల పక్షపాతి దివంగత మాజీ మంత్రి పరిటాల రవి అని పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు కొనియాడారు. మండలంలోని వింజనంపాడు పరిధిలోని చెరువుకట్ట దేవాలయ ప్రాంగణంలో పరిటాల వర్ధంతిని శుక్రవారం గ్రామస్తులు, పరిటాల వంశీయులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే గ్రామంలోని పరిటాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రామాంజనేయులు మాట్లాడుతూ పేద వర్గాలు, పేదల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడిన వ్యక్తి పరిటాల అని అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరావు, నిర్వాహకులు పరిటాల హరిబాబు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ కొర్రపాటి నాగేశ్వరరావు, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు మన్నవ వంశీ, ఉప్పుటూరి చిన రాములు, మిర్చి యార్డు మాజీ డైరెక్టర్ జంపని శ్రీనివాసరావు, చెరు కూరి ఇందుశేఖర్, నార్నె సాంబశివరావు, సర్పంచ్ శివశంకర్ పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ

తాడేపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో టీడీపీ ప్రాతూరు గ్రామ అధ్యక్షుడు అరవపల్లి శ్రీనివాస్ శుక్రవారం 30 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, ప్రాతూరు టీడీపీ అధ్యక్షుడు అరవపల్లి శ్రీనివాస్, మండల మహిళా అధ్యక్షురాలు బొర్రా కృష్ణవందన, తెనాలి మాణిక్యం, ప్రశాంతి, జి.లక్ష్మి పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్ లక్ష్యం : డీఎస్పీ

వట్టిచెరుకూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతలే లక్ష్యంగా ఫ్రెండ్లీ పోలీసింగ్ సేవలే లక్ష్యంగా పని చేద్దామని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సౌత్ జోన్ డీఎస్పీ భానోదయ అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆమె వట్టిచెరుకూరు పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం సాయంత్రం ఆమె సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. సీఐ రమా నాయక్, ఎస్ఐ సుబ్బారావులను కేసుల వివరాలు, సమస్యాత్మక గ్రామాలు, అద్దె భవనాల్లో కొనసాగుతున్న పోలీస్‌స్టేషన్ తదితర అంశాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు స్థల పరిశీలన చేశారు. అనంతరం గారపాడు ఎస్సీ కాలనీని ఆమె సందర్శించి అక్కడి వారితో మాట్లాడారు. డీఎస్పీ వెంట సీఐ రమా నాయక్, ఎస్ఐ సుబ్బారావు ఉన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన మాదినేని


సీఎం చంద్రబాబును కలిసిన శౌరిబాబు

పెదనందిపాడు, జనవరి, 24 (ఆంధ్రజ్యోతి): దావోస్ పర్యటన ముగించుకుని స్వదేశానికి చేరుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని శుక్రవారం ఉండవల్లిలోని ఆయన నివాసం వద్ద మాజీ సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మాదినేని శౌరిబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రాంత సమస్యలను చంద్రబాబుకు వివరించినట్లు శౌరిబాబు తెలిపారు.


బాండ్లను యార్డుకు తీసుకు వచ్చిన రైతులతో మాట్లాడుతున్న జేసీ భార్గవ్‌తేజ

వీలైనంత త్వరలో పంట నష్టపరిహారం

- దుగ్గిరాల కోల్డ్‌స్టోరేజ ప్రమాదబాధిత రైతులతో జేసీ భార్గవ్‌తేజ

దుగ్గిరాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కోల్డ్‌స్టోరేజిలో జరిగిన అగ్నిప్రమాదంలో పంట నష్టపోయిన బాధితరైతులకు పరిహారం అందించేందుకు బాండ్లపరిశీలన ప్రక్రియను జరుపుతున్నారని జేసీ భార్గవ్‌తేజ అన్నారు. దుగ్గిరాలలో ఏడాదిక్రితం స్థానిక శుభం కోల్డ్ స్టోరేజిలో జరిగిన అగ్నిప్రమాదంలో వందలాది రైతులు కోట్లాది రూపాయలు నష్టపోయిన విషయం విదితమే. ఏడాదికాలంగా పంట రైతులు పలురకాలుగా రైతు సంఘాలతో కలిసి ఆందోళన చేసినప్పటికీ నేటి వరకూ ఏ ఒక్క రైతుకూ నష్టపరిహారం అందలేదు. రెండునెలల క్రితం రెండ్రోజులపాటు న్యూ ఇండియా ఎస్యూరెన్స్ కంపెనీ వారు రెండు రోజులపాటు బాండ్లను పరిశీలించారు. రెండో విడతగా శుక్రవారం బాండ్లను కోల్డ్‌స్టోరేజి యజమాని శ్యాంకుమార్ సమక్షంలో పరిశీలించారు. సుమారు 232 మంది రైతులకు చెందిన 352 బాండ్లు, బ్యాంకు ఖాతాపుస్తకాలు, ఆధార్‌కార్డులను అధికారులు పరిశీలించారు. క్వింటాల్‌కు రూ.7 వేలు చెల్లించాలని కొందరు రైతు సంఘా ల నాయకులు ఇప్పటికే డిమాండ్ చేశారు. దుగ్గిరాల పసుపుయార్డుకు శుక్రవారం వచ్చిన జేసీ భార్గవ్‌తేజ బాధిత రైతులతో మాట్లాడారు. జేసీ మాట్లాడుతూ, నష్టపరిహా రం క్వింటాల్‌కు ఎంత చెల్లించాలి, మొత్తం ఎంత మంది రైతులకు చెల్లించాల్సిం ఉందనే విషయం స్పష్టత రానుందన్నారు. మంత్రి నారా లోకేశ్, కేంద్ర మంత్రుల ఆదేశాలతో పూర్తిస్థాయిలో న్యాయం చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం, స్థానిక అధికారులతో కలిసి పనిచేస్తోందన్నారు. రైతుల నుంచి వస్తున్న అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుంటూనే ఎంత మేరకు పరిహారం అందించగలరో నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ట్రైనీ కలెక్టర్ స్వప్నిల్‌పవార్, మార్కెటింగ్ ఏడీ రాజబాబు, యార్డుకార్యదర్శి ఎన్. శ్రీనివాసరావు, తహసీల్దార్ ఐ.సునీత, రైతుసంఘ రాష్ట్రసహాయకార్యదర్శి జొన్నా శివ శంకర్, రైతుసంఘ బాపట్ల జిల్లానాయకుడు వేములపల్లి వెంకట్రామయ్య, ములకా శివసాంబిరెడ్డి, జెట్టి బాలరాజు, రైతులు అధికారులు పాల్గొన్నారు.

పేరుకలపూడిలో భూ రీసర్వే పరిశీలించిన జేసీ

దుగ్గిరాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూ-రీసర్వే పైలెట్‌ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన పేరుకలపూడిలో రీ-సర్వే పనులను జేసీ భార్గవ్‌తేజ శుక్రవారం పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో మొత్తం 1720 ఎకరాల్లో జరుగుతున్న రీ-సర్వేకు సంబంధించి రెవెన్యూ అధికారు లకు పలు సూచనలు చేశారు. ఒక్కో బ్లాకుకు 200 నుంచి 250 ఎకరాలుగా ఆరుబ్లాకులుగా విభజించి వీఆర్‌ఓ, సర్వేయర్, వీఆర్‌ఏలతో బృందాలుగా రీ-సర్వే పనులను నిర్వహిస్తున్నారని జేసీకి తహసీల్దార్ ఐ. సునీత వివరించారు. రీ-సర్వేకు రైతులు సహకరించి, తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్, తెనాలి డివిజన్ సర్వే ఇన్‌స్పెక్టర్, పలువురు రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

భారతరత్న కర్పూరీ ఠాకూర్‌కు ఘననివాళి

మంగళగిరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): భారతరత్న కర్పూరీ ఠాకూర్ జయంతి సందర్భంగా మంగళగిరిలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నేతలు ఘననివాళి అర్పించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు మాట్లాడుతూ మహాత్మా గాంధీతో ప్రభావితుడైన కర్పూరీ ఠాకూర్ విద్యార్థి నాయకుడిగా ఆలిండియా స్టూడెంట్స్ ఫెడరేషన్‌లో చేరి క్విట్ ఇండియా వంటి స్వాతంత్రోద్యమాలలో పాల్గొన్నారని, జైలు జీవితం గడిపారని అన్నారు. 1952లో తొలిసారిగా సోషలిస్టు పార్టీ అభ్యర్థిగా విధాన సభ సభ్యునిగా ఎన్నికై పలుమార్లు ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా, ముఖ్యమంత్రిగా పనిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం యువజన అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్కాపురం కనకరావు, నేతలు కోలా అశోక్, కొమ్మవరపు భానుప్రసాద్, అన్నవరపు బ్రహ్మయ్య, పారేపల్లి మహేష్, కాగితాల స్వాతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు లోకేశ్ చేయూత

దుగ్గిరాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలం చిలువూరులో నలుగురు పేద విద్యార్థులకు రూ.5వేల చొప్పున రాష్ట్ర విద్య,ఐటీ, మానవవనరుల శాఖామంత్రి నారా లోకేశ్ అందించారు. గ్రామంలోని గణేష్‌యూత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మునునూరు శ్రీనివాసరావు, నల్లూరు మురళీ కృష్ణ, ఆలపాటి రామారావు, సుంకర బిట్టూ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణపై గోడప్రతుల ఆవిష్కరణ

మంగళగిరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గుడ్ షెపర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ, చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ముద్రించిన బాలికల సంరక్షణకు సంబంధించిన గోడప్రతులను శుక్రవారం ఆవిష్కరించారు. మంగళగిరి పట్టణ పోలీసు స్టేషన్, ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం, మండల విద్యా శాఖ కార్యాలయంలో అధికారులచే ఈ పోస్టర్లను ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ కే.అనూష, ప్రాజెక్ట్ ఇన్‌చార్జి సిస్టర్ లత, పట్టణ ఎస్ఐ వి.శ్రీహరిబాబు, ఎంఈవోలు కాజా శ్రీనివాసరావు, ఎన్.బాబు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి, గుడ్‌షెపర్డ్ సిబ్బంది నాగమణి, విజయరాఘవ, రత్నకుమార్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

- తాడేపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం పెనుమాక జడ్పీ హైస్కూ ల్‌లో పెనుమాక అంగన్వాడీ సెక్టార్, నవజీవన్ బాలభవన్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ బాలికాదినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. నీతోడు మానసిక వికాస కేంద్రం సైకాలజిస్టు జీ అనూష, పెనుమాక అంగన్‌వాడి సెక్టార్ సూపర్‌వైజర్ పి శిరోమణి మాట్లాడారు. పెనుమాక అంగన్వాడీ కార్యకర్తలు నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ రమేష్ పాల్గొన్నారు.
- పెదనందిపాడు, జనవరి, 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఏబీపాలెం, పెదనందిపాడు జిల్లా పరిషత్ పాఠశాల వద్ద శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కిశోర బాలికలు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. బాలికల పట్ల సోదరభావంతో మెలగాలంటూ ప్రతిజ్ఞ చేశారు.
- తాడికొండ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): బాలికల భద్రత ప్రతి ఒక్కరూ బాధ్యత గా తీసుకోవాలని ఎంపీడీవో కే సమతావాణి సూచించారు. జాతీయ బాలికా దినోత్సవం కార్యక్రమాన్ని ఫిరంగిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు, చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాడికొండ, రావెల, బేజాత్‌పురం, పాములపాడు, పొన్నెకల్లు, దామరపల్లి, ఫణిదరం, లచ్చన్నగుడిపూడి, గరికపాడు గ్రామాల్లో శుక్రవారం ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం న్యూట్రిషన్ సైంటిస్టు డాక్టర్ ఎం.దీప, తాడికొండ సర్పంచ్ తోకల సరోజిని, ఎంఈవో తెనాలి ఇందిరా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి, గరికపాడు సర్పంచ్ సింగు శకుంతల కోటేశ్వరరావు, ఫణి దరం సర్పంచ్ బాల కోటేశ్వరరావు, ఐసీడీఎస్ లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.శ్రీదేవి, రావెల, పొన్నెకల్లు, ఎస్.వీ.వీ.హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.
- ప్రత్తిపాడు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బాలికలు అన్ని రంగాల్లోనూ ముందుండాలని, అందుకు అనుగుణంగా అన్ని సమాన అవకాశాలు అందుబాటులో ఉన్నాయని ప్రత్తిపాడు సీడీపీవో సుజాతాదేవి తెలిపారు. ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. 'ఉజ్వల భవిష్యత్తు కోసం బాలికల సాధికారత' అనే అంశంపై వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఏసీడీపీవో విజయ నిర్మల, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, సూపర్ వైజర్లు భారతి, మాధవి పాల్గొన్నారు.
- తుళ్లూరు, జనవరి24(ఆంధ్రజ్యోతి) బాలికల బాల్యం కాపాడటం మనందరి బాధ్యత అని సీఐ గంగా వెంకటేశ్వర్లు అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ప్రో- చైల్డ్ గ్రూప్ గుంటూరు జిల్లా ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ ఆధ్వర్యంలో బాలికల భద్రత, ఆరోగ్యం విద్యపై బాధ్యత తీసుకుందాం అనే వాల్‌పోస్టర్‌ను పోలీసు స్టేషన్‌లో ఆవిష్కరించారు. స్థానిక కేవీఆర్ జిల్లా పరిషత్ పాఠశాలలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శిల్పా, ఇతర అధికారులు వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మంలో సీఐ అంజయ్య, కమ్యూనిటీ ఆర్గనైజర్ పోతురాజు పాల్గొన్నారు.
- దుగ్గిరాల, జనవరి 24: జాతీయబాలికాదినోత్సవం సందర్భంగా స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. దుగ్గిరాల పీహెచ్‌సీ డాక్టర్ ఇందిర మాట్లాడుతూ, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండగలుగుతారని చెప్పారు. కెఎల్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. హెచ్ఎం శోభాదేవి, జానమ్మ, వి.సుబ్బారావు, స్వరూపరాణి, బుజ్జి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

సమన్వయంతో పని చేసి అభివృద్ధి చేయాలి

- ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

పెదనందిపాడు, జనవరి, 24 (ఆంధ్రజ్యోతి) : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. స్థానిక సోమేశ్వరస్వామి కల్యాణ మండపంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమావేశాలు నిర్వహించేటప్పుడు తప్పనిసరిగా పిలవాలని, అధికారులు విధినిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అర్హులందరికీ క్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. గ్రామాల్లోని ఎన్నారైలను గుర్తించి గ్రామ అభివృద్ధిలో భాగస్వాములను చేయాలన్నారు. ప్రతి కుటుంబానికి ఏడాదికి రు.1.5లక్షలు లబ్ధి చేకూర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. పుసులూరుకి చెందిన నాయకుడు కాంద్రు రాంబాబు, మరికొంత మంది కార్యకర్తలు మాట్లాడుతూ ముందు గ్రామాల్లో నాయకుల మధ్య నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరగా, త్వరలో గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తొలుత ఏబీపాలెంలోని ఎన్ఆర్‌జీఎస్ నిధులతో నిర్మించిన గోకులం షెడ్డులను ప్రారంభించారు. అన్నవరం గ్రామంలో హోమం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ కొర్రపాటి నాగేశ్వరరావు, ఎంపీడీవో లక్ష్మీదేవి, తహసీల్దార్ శంకరబాబు పాల్గొన్నారు.

సీసీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్


జంగంగుంట్లపాలెంలో సీసీ రోడ్లును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రావణ కుమార్

మేడికొండూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమినేనివారిపాలెం, జంగంగుంట్లపాలెం, పొట్లపాడుల లో పలు అభివృద్ధి పనులను తాడికొండ శాసనసభ్యుడు తెనాలి శ్రావణ్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ముందుగా నరకుళ్లపాడు మేజరు కాలవ అభివృద్ధి పనులను ఆయనప్రారంభించారు. అనంతరం జంగంగుంట్లపాలెంలో రూ.4 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును, పొట్లపాడులో నిర్మించిన మినీ గోకుల్ షెడ్‌ను ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న వాటర్ ప్లాంట్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మేడికొండూరు జడ్పీటీసీ సభ్యులు కందుల సిద్దయ్య, జంగంగుంట్లపాలెం సర్పంచ్ కల్లి శ్రీదేవి, మాజీ సర్పంచ్ నాగిశెట్టి రామయ్య, ఎంపిటిసి సభ్యురాలు తియ్యగూర అనురాధ, ఫిరంగిపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నార్నె శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లిపెద్ది రమేష్, జనసేన అధ్యక్షుడు రాచర్ల నాగబాబు, ఎంపీడీఓ తోట చందన, తహసీల్దార్ ఎం. హరిబాబు, నాయకులు మక్కపాటి నాగమల్లేశ్వరరావు, శాఖమూరి కృష్ణారావు తదితరులతో పాటు తెలుగుదేశం, జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


కొండవీటి మేజరు కాలువ పనులు ప్రారంభం

ఫిరంగిపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుంటూరు బ్రాంచ్ కాలువ నుంచి పెదనందిపాడు కాలువ వరకు ప్రవహించే కొండవీటి మేజరు కాలువ పనులను ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. స్వయంగా జేసీబీని నడిపిన ఆయన మాటాడుతూ 27 కిలోమీటర్ల పొడవు ఉన్న ఈ కాలువ ద్వారా ఏడు వేల ఎకరాలకు నీరు అందించాల్సి ఉందని అన్నారు. ఈ కాలువకు గత ఐదేళ్లగా ఎలాంటి మరమ్మతులు లేకుండా ఉంచడంతో నాచు, డెక్క, ఆయా గ్రామాల చెత్త కూడా కాలువల్లో పడేయడంత సరిగా ప్రవహించక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కాలువ నిర్మించినప్పుడు కట్టిన సైఫన్‌లు జల్లెడగా కారి పోతున్నా యని, కాలువ కట్టలు కూడా బలహీనంగా ఉన్నాయని, వీటికి మరమ్మతులు చేసేందుకు పనులు ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ ఆరే పున్నారెడ్డి, కొత్తపల్లి కోటేశ్వరరావు, ఎర్రగుంట్లపాడు కాలువ డీసీ నల్లజర్ల రవి కుమార్, వేల్పుల అంకారావు, గుండెగ జోజి, కటికల అప్పారావు, నార్నె శ్రీనివాసరావు తదితర నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ నేత క్రోసూరి హరిబాబు గుండెపోటుతో మృతి

ఫిరంగిపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొనుగుపాడుకి చెందిన మండల తెలుగుదేశం పార్టీ నేత క్రోసూరి హరిబాబు(61) గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారని బంధువులు తెలిపారు. మృతుడు హరిబాబు గ్రామంలో మాజీ గ్రామ అధ్యక్షుడిగా, మండలంలోని ఉపాధ్యక్ష పదవులతో పంచాయతీ ఉపాధ్యక్షుడిగాను అనేక పదవులు నిర్వహించినట్లు చెప్పారు. పలు నాటకాలను ఆయన ప్రదర్శించారని గ్రామ పెద్దలు తెలిపారు. మృతదేహాన్ని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, జిల్లా సర్పంచ్‌ల సంఘం కార్యదర్శి కంభం పెదబాబు, జిల్లా టీడీపీ కార్యవర్గ కార్యదర్శి కొత్తపల్లి కోటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు మండవ నరసింహారావు, గుంటుపల్లి తులసీధరరావు, నార్నె శ్రీనివాసరావు, వై.రామకృష్ణ, వేల్పుల అంకారావు, బత్తుల సురేష్, కర్లపూడి రాఘవరావు, హృదయరాజు సందర్శించి నివాళులర్పించారు.

నవులూరులో గంజాయి పట్టివేత


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు

మంగళగిరి సిటీ, జనవరి 24 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని నవులూరు గ్రామంలో గంజాయి విక్రయి స్తున్న ఓ యువకుడ్ని మంగళగిరి రూరల్ పోలీసు లు అదుపులోకి తీసుకున్నారు. రూరల్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం సీఐ వై.శ్రీనివాసరావు వివరాలను వెల్లడించారు. నవులూరు ఎమ్మెస్సెస్ కాలనీకి చెందిన దాసరి లక్ష్మీనారాయణ గంజాయి విక్రయిస్తున్నట్టు సమాచారం రావడంతో పోలీసులు దాడి చేశారు. నిందితుడి వద్ద నుంచి 1100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని పది గ్రాముల ప్యాకెట్లుగా మార్చి ఒక్కో ప్యాకెట్‌ను రూ.500 నుంచి రూ.600 వరకు విక్రయిస్తున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. ఇటీవల తాడేపల్లి సీతానగరంలో ఈ గంజాయిని కొనుగోలు చేసినట్టు గుర్తించారు. నిందితుడ్ని మంగళగిరి కోర్టులో హాజరు పర్చగా న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించిందని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్, సిబ్బంది గణేష్, వేమన, హనుమంతు, రామలింగేశ్వరరావు, శ్యామ్, రైటర్ బీమా శంకర్ పాల్గొన్నారు.

రైతులకు వెన్నుదన్నుగా ఉచిత వైద్య శిబిరాలు : జేడీ

వట్టిచెరుకూరు, జనవరి 24 (ఆంధ్ర జ్యోతి) : రైతులకు వెన్నుదన్నుగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం పశుపోషణకు సంబంధించిన అనేక రాయితీలతో పాటు వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తోందని పశుసంవర్థక శాఖ జేడీ నరసింహారావు అన్నారు. అనంతవరప్పాడులో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ దారా వెంకటరావు ప్రారంభించారు.